# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 31-5-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:231 పేజీలు:6 వెల: రూ.1/-


### నేటి కందం-నేటికి అందం

తీరుగ క్రిక్కెటు నందున
భారత మహిళలు గెలిచిన వైనము గని జో
హారులు చేసి ప్రపంచము
హారతు లెత్తినది మిగుల నానందముతోన్ !!

(ఇంగ్లండ్ మీద క్రికెట్ లో భారత మహిళా జట్టు గెలిచిన పద్ధతి ని చూచి ప్రపంచం జోహారులు చేసి హారతు లందించడం భారతీయు లందరికీ గర్వకారణం.)



-రాధశ్రీ
సెల్:9494481210

### చురక

నక్కలాగ మన నేతలు
నాచుబెట్టి చూస్తుంటరు
కుంటలన్నీ చెరువులన్నీ
కబ్జాచేస్తూ మేస్తుంటరు.
అక్రమాలు సక్రమంగా
అన్నీ మారిపోతుంటయి
ప్రభుత్వాలు ఏవొచ్చినా
పైకి హాట్ హూటంటయి



-వేల్పుల నారాయణ
9440433475

## మే 31 నుంచి ధవళేశ్వరం కాలువలకు నీటి విడుదల: మంత్రి కందుల దుర్గేష్

అమరావతి, మే 30:నీటిపారుదల సలహా మండలి సమావేశంలో ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి సరఫరాపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బలరామకృష్ణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు అందించేందుకు కాలువలు తెరిచే తేదీలు, నీటి పంపిణీ ప్రణాళికపై విస్తృతంగా చర్చించారు. మే 31వ తేదీ నుంచి ధవళేశ్వరం బ్యారేజీ నుంచి కాలువలకు నీటిని విడుదల చేయాలని నిర్ణయించినట్లు మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ప్రస్తుతం కాలువల మరమ్మతు పనులు కొనసాగుతున్నందున, పరిస్థితిని బట్టి దశలవారీగా వివిధ కాలువలకు నీటిని విడుదల చేస్తామని చెప్పారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల మరమ్మతుల కోసం రూ.148 కోట్లు విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలుపుతూ సమావేశంలో తీర్మానం చేసినట్లు మంత్రి వెల్లడించారు. అలాగే గోదావరి నది కాలుష్య నివారణ కోసం రూ.100 కోట్లు మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి ధన్యవాదాలు తెలుపుతూ మరో తీర్మానం ఆమోదించినట్లు చెప్పారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తుగా నాట్లు వేసుకునేందుకు సిద్ధం కావాలని మంత్రి కందుల దుర్గేష్ సూచించారు.

## పలు జిల్లాల్లో పర్యటించనున్న సీఎం రేవంత్ రెడ్డి..

హైదరాబాద్, మే 30: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. అలాగే బహిరంగ సభలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జూన్ 1న ఆదిలాబాద్‌కు సీఎం రేవంత్ రెడ్డి రానున్నారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టను న్నారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించనున్నారు.

జూన్ 3న రంగారెడ్డి జిల్లా కోహెడలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. కాగా, తెలంగాణ ప్రభుత్వం కోహెడలో 239 ఎకరాల్లో అత్యాధునిక సౌకర్యాలతో మార్కెట్‌ను నిర్మించనుంది. ఆ తర్వాత అదే రోజు మహబూబ్‌నగర్ జిల్లాలో సీఎం రేవంత్ పర్యటిస్తారు. రాత్రికి సోమశిలలో బస చేయనున్నారు. జూన్ 4న జూరాల, నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పనులను పరిశీలిస్తారు. నార్లాపూర్, వట్టెం, ఏదుల రిజర్వాయర్లను సందర్శించి పెండింగ్ ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించనున్నారు.

జూన్ 5న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో మహిళా సంఘాలకు బస్సులను రేవంత్ రెడ్డి పంపిణీ చేయనున్నారు. రూ.199 కోట్లతో కొనుగోలు చేసిన 553 బస్సులను మహిళలకు అందించనున్నారు. కాగా, మహిళా సంఘాలకు బస్సులు అందించి, వాటిని తెలంగాణ ఆర్టీసీకి అద్దెకు ఇచ్చే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది.

## సుమన్ మాటల వెనక కుట్ర ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్

హైదరాబాద్, మే 30: బీఆర్ఎస్ పార్టీ నేత బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. సింగరేణిపై చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే జైలుకు పంపుతున్నారని బాల్క సుమన్ ఆరోపించారు. ఆయన మాటలకు కౌంటర్ గా ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ స్పందించారు. సుమన్ అరెస్ట్ కావడానికి కారణం ఆయన మాటలేనని వెంకట్ అన్నారు.

గాంధీభవన్ లో ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ మీడియాతో మాట్లాడుతూ...'బాల్క సుమన్ అరెస్ట్ కావడానికి ఆయన మాటలే కారణం. సుమన్ వ్యాఖ్యల వెనక కేసీఆర్ కుట్ర ఉంది. మీకు కోపం ఉంటే మాపై దాడి చేయండి. సామాన్య ప్రజలు తిరిగే రైళ్లపై మీకు ఎందుకు అంత అక్కసు. రైళ్లలో తిరిగేది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేదలే. మీకు ఓట్లేయలేదని పేదలపై కోపమా. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నేనూ నిరసన కార్యక్రమాలు చేశాను.

మేం ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు చేశాము' అని వెంకట్ అన్నారు.'కేసీఆర్ ఒకయానికి డ్రగ్ శాఖ ఇచ్చాడు. మరొకరికి పిచ్చోడిలా వాగే శాఖ ఇచ్చాడు. సుమన్‌కి రైలు పట్టాలు కోసే శాఖ ఇచ్చాడు. బీఆర్ఎస్ పార్టీని ఎవరూ పట్టించుకోవడం లేదు. తెలంగాణలో శాంతిభద్రతలకు విఘాతం కల్పించాలని కేసీఆర్ కుట్ర చేస్తున్నారు. సుమన్ లాంటి వ్యక్తులపై పీడీ యాక్ట్ పెట్టాలి' అంటూ బల్మూరి వెంకట్ ఫైర్ అయ్యారు.

## ముంబైలో భారీ ఉగ్రదాడి కుట్ర భగ్నం

### 9 మంది ఐఎస్ఐ ఏజెంట్ల పట్టివేత
### దావూద్ ఇబ్రహీంతో రిలేషన్
### తీవ్ర పేలుళ్లకు పథకం
### భారీగా ఆయుధాలు స్వాధీనం
### ఢిల్లీలో హై అలెర్ట్

న్యూఢిల్లీ, మే 30:ఢిల్లీ, ముంబైలలో భారీ ఉగ్రదాడి కుట్రను ఢిల్లీ పోలీసులు భగ్నం చేశారు. 9 మంది పాకిస్థాన్ గూఢచారులను పట్టుకున్నారు. అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీంతో వీరికి సబంధాలు ఉన్నాయి. పకడ్బంధీ ప్లాన్ తో ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ శనివారం ఈ ఉగ్ర ముఠాను అరెస్టు చేసింది.

నిందితుల్లో ఢిల్లీ, ముంబై, పంజాబ్ రాష్ట్రాలకు చెందిన పాక్? ఐఎస్ఐ ఏజెంట్లుగా గుర్తించారు. వీరిలో కొందరు విదేశీయులూ ఉన్నట్టు తేలింది. కూడా ఉన్నారు. ఈ ఆపరేషన్‌లో భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ స్వాధీనం చేసుకుంది.

దేశంలోని వివిధ ప్రాంతాల్లోని కీలక సంస్థలు, భద్రతా సిబ్బందిపై దాడులు చేసేందుకు ఈ బృందం పథకం రచించినట్టు అధికారులు గుర్తించారు. . ఈ ముఠాపై కొన్నాళ్లుగా నిఘా ఉంచిన తర్వాత అరెస్టులు జరిగాయని ఆ నివేదిక పేర్కొంది. అనుమానితుల కార్యకలాపాల పర్యవేక్షణ ఆధారంగా స్పెషల్ సెల్ ఈ ఆపరేషన్‌ను నిర్వహించింది. ఈ బృందం సరిహద్దు ఉగ్రవాదం వ్యవస్థీకృత నేర శక్తులతో ఒక పెద్ద నెట్‌వర్క్ సృష్టించినట్టు దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకోవడంతో పెద్ద ఉగ్ర కుట్ర భగ్నమైందని , ఈ నెట్‌వర్క్ కార్యకలాపాల కీలక సమాచారం లభించిందని పోలీసులు తెలిపారు.

ఈ నెట్‌వర్క్ పూర్తి స్థాయిని నిర్ధారించడానికి ఈ మాడ్యూల్‌తో సంబంధం ఉన్న అదనపు కార్యకర్తలను గుర్తించడానికి, అనుమానితుల కమ్యూనికేషన్ రికార్డులు, ఆర్థిక లావాదేవీలు ట్రావెల్ హిస్టరీని దర్యాప్తు అధికారులు పరిశీలిస్తున్నారు.స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, మందుగుండు సామగ్రి ఎక్కడి నుంచి తీసుకువచ్చారో గుట్టును రట్టు చేస్తున్నారు. విదేశాల్లో మకాం వేసిన హ్యాండ్లర్లతో ఆ బృందానికి రిలేషన్? అంతు తేల్చుతున్నారు.

సరిహద్దులోని సంస్థ మద్దతుతో పనిచేస్తున్న ఉగ్రవాద, వ్యవస్థీకృత నేరాల నెట్‌వర్క్‌లను నిర్మూలించే ప్రయత్నాలలో ఈ అరెస్టులు ఒక ముఖ్యమైన ముందడుగు అని అధికారులు అభివర్ణించారు. తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని, విస్తృత కుట్రను, అమలుకు తుది దశలో ఉన్న ఏవైనా ప్రణాళికలను వెలికితీసేందుకు భద్రతా సంస్థలు పనిచేస్తున్నాయని పోలీసులు తెలిపారు.

### ఢిల్లీలో హై అలర్ట్

తీవ్రవాద ముప్పు పొంచి ఉందని నిఘా వర్గాల సమాచారం నేపథ్యంలో ఢిల్లీ వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎన్‌డిటివి నివేదిక ప్రకారం, సెంట్రల్ ఢిల్లీలోని కీలక సంస్థలు, రద్దీ ప్రాంతాలపై ఆత్మాహుతి దాడులు, వాహన ఆధారిత ఐఈడీలు, కాల్పులు, సమన్వయ దాడుల ద్వారా దాడులు జరిగే అవకాశం ఉందని ఏజెన్సీలకు ముందే హెచ్చరికలు అందాయి. అన్ని జిల్లా యూనిట్లు అప్రమత్తంగా ఉండాలని, నిఘా మరియు పారామిలిటరీ ఏజెన్సీలతో సన్నిహిత సమన్వయం కొనసాగించాలని ఆదేశించబడ్డాయి. గత సంవత్సరం రెడ్ ఫోర్ట్ సమీపంలో వాహనంతో జరిగిన ఐఈడీ పేలుడులో 15 మంది మరణించడం, పలువురు గాయపడటం నేపథ్యంలో ఈ అప్రమత్తతను పెంచారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుతం రైతులకు, ప్రజలకు పనికి రాకుండా పోయిందని : దత్తాత్రేయ

కరీంనగర్, మే 30:హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ గోదావరిఖనిలో పర్యటించి కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజ్‌పై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఇప్పటికే స్పష్టమైన నివేదిక ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. లక్ష కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుతం రైతులకు, ప్రజలకు పనికి రాకుండా పోయిందని విమర్శించారు. ప్రాజెక్టుకు అవసరమైన మరమ్మతులు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి కనిపించడం లేదని ఆరోపించారు.

ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని రైతులు సాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దత్తాత్రేయ తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మూడు ప్రధాన బ్యారేజీల్లో ప్రస్తుతం నీరు లేకపోవడం ఆందోళనకర విషయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి, రైతులకు సాగునీరు అందించే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు అవసరమైన సాగునీటిని అందించడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు.

## సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ఏకగ్రీవ ఎన్నిక

బెంగళూరు, మే 30: కర్ణాటక కొత్త ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ పగ్గాలు చేపట్టడానికి మార్గం సుగమమైంది. శనివారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో కర్ణాటక అసెంబ్లీ కాన్ఫరెన్స్ హాల్లో కాంగ్రెస్ లిజిస్లేచర్ పార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ పేరును సిద్ధరామయ్య ప్రతిపాదించారు. ఎమ్మెల్యేలు సమర్థించడంతో ఏకగ్రీవంగా డీకే ఎన్నిక జరిగింది. పార్టీ కేంద్ర పరిశీలకుల సమక్షంలో ఈ ఎన్నిక జరిగింది. సీఎల్పీ నేతగా డీకే ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు పార్టీ కర్ణాటక వ్యవహారాల ఇన్‌చార్జి రణ్‌దీప్ సూర్జేవాలా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటించారు.

దీనికి ముందు సీఎల్‌పీ సమావేశానికి డీకే బయలుదేరినప్పుడు.. ఆయన అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. ముఖ్యమంత్రిగా ఈనెల 3న ప్రమాణస్వీకారం చేయనున్నారా అని మీడియా అడిగినప్పుడు 'థర్డ్ థర్డ్' అంటూ డీకే సమాధానమిచ్చారు. అనంతరం సీఎల్పీ సమావేశం కోసం విధాన సౌధకు చేరుకున్నారు. విధానసౌధ మెట్లకు నమ్మస్కారం చేసిన అనంతరం లోపలకు అడుగుపెట్టారు.

## నీటి గుంతలో మునిగి తల్లి, కుమార్తె మృతి

అమరావతి, మే 30:అనంతపురం జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. విహారయాత్రకు వెళ్లిన కుటుంబ సభ్యుల్లో తల్లి, కుమార్తె ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి మృతిచెందారు. ఈ ఘటనతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

అనంతపురం నగరంలోని అజాద్‌నగర్‌కు చెందిన తొమ్మిది మంది కుటుంబ సభ్యులు ఇవాళ పీఏబీఆర్ డ్యామ్ సమీపానికి విహారయాత్రకు వెళ్లారు. ఉరవకొండ మండలం కౌకుంట్ల గ్రామం చివర డ్యామ్ వద్ద అందరూ సరదాగా గడుపుతుండగా, షేక్ ఫరీదా (35), షేక్ యాస్మిన్ (13) ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడిపోయారు.

నీటిలో పడిన ఇద్దరికీ ఈత రాకపోవడంతో బయటకు రాలేక ఊపిరాడక మృతిచెందారు. విషయం తెలుసుకున్న స్థానికులు, కుటుంబ సభ్యులు వారిని ర క్షిం చేం దు కు ప్రయత్నించినప్పటికీ అప్పటికే ఆలస్యమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మృతురాలు ఫరీదా తల్లి షేక్ కుర్సీద్ భాను ఫిర్యాదు మేరకు ఉరవకొండ ఎస్సై జనార్ధన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో బాధిత కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

## అవసరమైతే ఆపరేషన్ సింధూర్ 2.0కు సైనిక దళాలు సిద్ధం: ఆర్మీ చీఫ్

న్యూఢిల్లీ, మే 30: ఒకవేళ అవసరమైతే ఆపరేషన్ సింధూర్ 2.0 చేపట్టేందుకు సైనిక బలగాలు సిద్ధంగా ఉన్నట్లు ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది తెలిపారు. ఆధునిక యుద్ధ రీతుల్లో ఆరితేరేందుకు త్రివిధ దళాలు సన్నద్ధం అవుతున్నాయని ఆయన అన్నారు. భూమి, ఆకాశం, సముద్రంలో అత్యాధునిక రీతిలో సైనిక సామర్థ్యాన్ని పెంచుకుంటున్నట్లు చెప్పారు. పుణెలో జరిగిన నేషనల్ డిఫెన్స్ అకాడమీ పాసింగ్ ఔట్ పరేడ్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం ఉద్రిక్తల పరిస్థితులు తాత్కాలికంగా అదుపులో ఉన్నా.. కానీ రాబోయే దశకు చెందిన యుద్ధాన్ని ఎదుర్కొనేందుకు త్రివిధ దళాలు భీకరంగా రెడీ అవుతున్నట్లు ఆయన చెప్పారు.



భవిష్యత్తులో జరగబోయే యుద్ధాలు కేవలం సంప్రదాయ రీతికే పరిమితం కావు అని, సైబర్.. ఎలక్ట్రోమ్యాగ్నటిక్, కాగ్నిటివ్ డోమెయిన్లలోనూ యుద్ధ ప్రభావం ఉంటుందని ఆర్మీ చీఫ్ అన్నారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత్ తన సత్తా చాటిందన్నారు. సైనిక దళాలు చాలా కచ్చితత్వంతో అటాక్ చేయగలవని నిరూపించామన్నారు. యుద్ధ క్షేత్రంలో జరుగుతున్న మార్పుల పట్ల ఆర్మీ జాగృతతో ఉందని, భవిష్యత్తుకు తగ్గట్లుగా అన్ని దళాలు ఆధునిక విధానంలో సమాయత్తం అవుతున్నాయని అన్నారు. మార్పుల్లో భాగంగా దివ్యాస్త్ర బ్యాటరీలు, శక్తిమాన్ రెజిమెంట్స్, భారత్ బెటాలియన్స్‌తో పాటు ఇతర టెక్నాలజీ ఆధారిత సైన్యాన్ని రూపొందిస్తున్నట్లు ఆయన చెప్పారు.

అన్ని అకాడమీల్లో డ్రోన్ల వినియోగంపై శిక్షణ జరుగుతోందన్నారు. ఎన్డీఏ శిక్షణా కేంద్రంలో భారీ డ్రోన్లు, సిములేటర్లతో ఎన్డీఏ క్యాడెట్లకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశంలోనూ ముందంజలో ఉన్నట్లు జనరల్ ద్వివేది తెలిపారు. ఓడీఏ.. అబ్జర్వ్, ఓరియంట్, డిసైడ్, యాక్ట్ చక్రాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఏఐ ఆధారిత సేవల వినియోగాన్ని పెంచుతున్నట్లు చెప్పారు.

## గదిలో విషవాయువు నింపి వ్యక్తి ఆత్మహత్య..

అహ్మదాబాద్, మే 30:ఉద్యోగం కోల్పోయి అప్పుల ఊబిలో కూరుకుపోయిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటిలోని గదిలో విషవాయువు నింపుకుని చనిపోయాడు. ఇంటి లోపలకు రావద్దని, విష వాయువు ఉన్నదంటూ సూసైడ్ నోట్ ద్వారా కుమార్తెను హెచ్చరించాడు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఈ సంఘటన జరిగింది. ముంబైకు చెందిన 42 ఏళ్ల పంకజ్ భన్సాలీ తన కుటుంబంతో కలిసి గాంధీనగర్‌లోని ఉన్నత ప్రాంతంలో నివసిస్తున్నాడు.

కాగా, గాంధీనగర్ ఇన్ఫోసిటీలోని స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన ఒక సంస్థలో పంకజ్ పనిచేశాడు. అయితే ఐదు నెలల కిందట ఉద్యోగాన్ని కోల్పోయాడు. స్టాక్ మార్కెట్‌లో భారీ నష్టాలు రావడంతో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. ఈ నేపథ్యంలో అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. మానసిక ఒత్తిడికి గురయ్యాడు.


మరోవైపు మే 22న పంకజ్ భార్య తన కుమార్తెతో కలిసి పుట్టింటికి వెళ్లింది. దీంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న అతడు ఆ మరునాడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 'సెల్ఫాస్' అనే విష వాయువు వల్ల చనిపోయాడు. పంకజ్ ఫోన్ ఎత్తకపోవడంతో అతడి భార్య అనుమానించింది. కుమార్తె, సోదరుడితో కలిసి ఇంటికి చేరుకున్నది.అయితే ఇంటి బయట ఒక హెచ్చరిక నోట్ వారికి కనిపించింది. 'లోపల విష వాయువు ఉన్నది. లోనికి రావద్దు. మాస్క్ ధరించండి. ఇంట్లోని నీటిని తాగవద్దు. మాస్వీ బయటే ఉండు' అని కుమార్తెను ఉద్దేశించి అందులో రాసి ఉన్నది. ఇంట్లోని గదిలో పంకజ్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గమనించారు.

ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు. విషం వల్ల పంకజ్ మృతదేహం నల్లగా మారి ఉబ్బడాన్ని పరిశీలించారు. ఐదు రోజులుగా మృతదేహం ఆ ఇంట్లో ఉన్నట్లు గ్రహించారు. పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ ఇంటి నుంచి 'సెల్ఫాస్' విషాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.

## ఘనంగా మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు

### – పార్టీ శ్రేణులు, అభిమానుల సంబరాలు

రాజన్న సిరిసిల్ల, మే 30: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు వేములవాడ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు వేడుకలను ఘనంగా నిర్వహించారు.



ఈ సందర్భంగా కౌన్సిలర్ తూమ్ మధు, కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ప్రతి కార్యకర్తకు 'అన్నా' అని పిలిస్తే 'నేను ఉన్నా' అని పలికే దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా, మూడు పర్యాయాలు మంత్రిగా సేవలందిస్తూ తెలంగాణ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తూ రాష్ట్రానికి కోట్ల రూపాయల పెట్టుబడులు తీసుకొచ్చారు. తన తండ్రి శ్రీపాదరావు గారి బాటలో నడుస్తూ తండ్రికి తగ్గ తనయునిగా ప్రజల మన్ననలు పొందుతున్నారు. వారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించి మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని కోరుకుంటున్నామని అన్నారు.

## 'పోడు భూములకు విద్యుత్, బోర్ల సౌకర్యం కల్పించాలి'

### – జూలూరుపాడు ఎంపీడీఓకు అనంతారం రైతుల వినతి

ఖమ్మం, మే 30:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల పరిధిలోని అనంతారం గ్రామానికి చెందిన పోడు రైతులు శనివారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి తాళ్లూరి రవికి వినతిపత్రం సమర్పించారు. సాగు చేసుకుంటున్న పోడు భూములలో ఐటీడీఏ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు బోర్లు వేయించి ఇవ్వాలని కోరారు. ?అనంతారం గ్రామ సర్పంచ్ కొర్సా రమేష్ ఆధ్వర్యంలో సుమారు 19 మంది పోడు రైతులు ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులను అందజేశారు. దశాబ్దాలుగా నమ్ముకుని సాగు చేసుకుంటున్న భూములకు నీటి వసతి, కరెంట్ లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఐటీడీఏ నిధుల ద్వారా బోర్లు, విద్యుత్ లైన్లు మంజూరు చేసి తమను ఆదుకోవాలని రైతులు ఎంపీడీఓను కోరారు.

## ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

### – బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

కరీంనగర్, మే 30:కరీంనగర్‌లో బీజేపీ శ్రేణుల శిక్షణ తరగతుల ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామ చందర్ రావు, రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు, రవాణా, గోదాముల నిర్వహణ తదితర ఖర్చులకు అవసరమైన నిధులన్నీ కేంద్ర ప్రభుత్వమే అందిస్తున్నప్పటికీ, రైతుల నుంచి వడ్లను సక్రమంగా కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శించారు. రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు "రైతు గోస - బీజేపీ భరోసా'' యాత్ర నిర్వహించినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని అన్నారు.అకాల వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, అయినప్పటికీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వ ఉండటం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ధాన్యం సేకరణపై ప్రభుత్వానికి స్పష్టమైన గణాంకాలు లేవని, మంత్రులే పరస్పర విరుద్ధమైన లెక్కలు చెబుతున్నారని విమర్శించారు.వడ్ల కొనుగోళ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కేవలం మధ్యవర్తి పాత్ర మాత్రమే పోషిస్తోందని, ఇందుకు కేంద్రం కమిషన్ కూడా చెల్లిస్తోందని రామచందర్ రావు అన్నారు. అయినప్పటికీ రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో మిగిలి ఉన్న ధాన్యాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తిగా కొనుగోలు చేయాలని, అకాల వర్షాలతో దెబ్బతిన్న ధాన్యాన్ని కూడా రైతులకు నష్టం కలగకుండా స్వీకరించాలని డిమాండ్ చేశారు. అలాగే అన్ని రకాల వడ్లకు బోనస్ ప్రకటించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ పై కూడా ఆయన విమర్శలు గుప్పించారు.

# పొగాకు వ్యసనం ప్రాణాంతకం

## (31 మే "ప్రపంచ పొగాకు రహిత దినం" లేదా "ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం" సందర్భంగా)

సిగరెట్లు, బీడీలు, పైపులు, గుట్కాలు, నసెం పొడులు, జర్దా, ఖైనీ, స్మోక్‌లెస్ టొబాకో లాంటి పలు రకాలైన పొగాకు ఉత్పత్తులు పలు ఆకర్షణీయ రూపాల్లో మనల్ని వశపరుచుకునే విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. వీటికి తోడుగా పొగరాయుళ్లతో తిరిగే స్నేహితులు, బంధువులు కూడా సెకండ్ హాండ్ స్మోకర్స్‌గా తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారు. అవగాహనలేమి లేదా తెలిసి కూడా పొగాకు ఉత్పత్తుల వాడకంతో నిండు ప్రాణాలు ప్రమాదంలో పడడం, చివరికి వైద్య ఖర్చులకు కుటుంబాలు బజారున పడడం, ప్రాణాలు కూడా పోవడం చూస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా పొగాకు దురలవాటుతో సాలీనా 8.7 మిలియన్ల ప్రాణాలు పోతున్నాయని, అనేక మిలియన్ల ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని గణాంక వివరాలు స్పష్టం చేస్తున్నాయి. పొగాకు రహిత సమాజ స్థాపన జరగాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ కృషి చేయడం సముచితంగా ఉన్నది.

పొగాకు పరిశ్రమల అనైతిక ప్రచార విష వలయంలో పడొద్దు:

1988లో ఐరాస – డబ్ల్యూహెచ్ఓ చొరవతో పొగాకు దురలవాటు దుష్ప్రభావాలను సామాన్య ప్రజలకు అవగాహన పర్చడంలో పాటు ఆ ఉత్పత్తుల మాయ వలలో పడకుండా హెచ్చరించడానికి ప్రతి ఏట 31 మే రోజున "ప్రపంచ పొగాకు రహిత దినం (వరల్డ్ నో టొబాకో డే)" లేదా "ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం( ప్రపంచ ఆంటీ–టొబాకో డే)" పాటించుట ఆనవాయితీగా మారింది. 2026 ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం ఇతివృత్తంగా "అన్‌మాస్కింగ్ ది అప్పీల్ – కౌంటరింగ్ నికోటిన్ అండ్ టొబాగో అడిక్షన్ (పొగాకు కంపెనీల విజ్ఞప్తుల గుట్టు విప్పడం – నికోటిన్, పొగాకు వ్యసనాల్ని వ్యతిరేకిద్దాం)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు. పొగాకు ఉత్పత్తులను తయారు చేసే కంపెనీలు వాడే ప్రమాదకర సువాసనలను వెదజల్లే పదార్థాలను వాడడం, మార్కెటింగ్ విధానాల్లో అనైతిక పద్ధతులు వాడడం, ఆకర్షణీయ ప్యాకేజీలను వాడడం, ప్రముఖులతో ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం, ప్రమాదకర ఇతర పదార్థాలను వాడడం లాంటి పోకడలను వ్యతిరేకించడం జరుగుతున్నది. పొగాకు పరిశ్రమలు గుప్పించే ప్రకటనల విషవలయంలో చిక్కి 37 మిలియన్ల 13 – 15 ఏండ్ల పిల్లలు కూడా సతమతం అవుతున్నారు. పొగాకు, నికోటిన్ ఉత్పత్తుల పరిశ్రమలు దాదాపు 16,000 రకాల సువాసన కలిగిన రసాయన పదార్థాలను కలుపుతున్నట్లు తెలుస్తున్నది.

భారతంలో పొగాకు ఉత్పత్తుల వాడకం – దుష్ప్రభావాలు:

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1.3 బిలియన్ల ప్రజలు పొగాకు ఉత్పత్తుల దురలవాటుకు లోనైనారని, భారత్‌లో 15 ఏండ్ల పైబడిన 253 మిలియన్ల ప్రజలు (పురుషులు, మహిళలు) దురలవాటు గుప్పిట్లో చిక్కిపోయారని తెలుస్తున్నది. ప్రపంచ దేశాల్లో పొగాకు ఉత్పత్తులు వాడడంలో రెండవ స్థానంలో నిలుస్తున్న భారత్‌లో సెకండ్ హాండ్ స్మోకింగ్ కూడా అధికంగా ఉందని హెచ్చరిస్తున్నారు. పొగాకు దురలవాటు అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే 80 శాతం వరకు ఉందని గమనించాలి. భారత్‌లో అత్యంత ప్రమాదకర ప్రజారోగ్య సమస్యల్లో పొగాకు దురలవాటు 5వ స్థానాన్ని ఆక్రమించింది. పొగాకు దురలవాటుతో 18 శాతం హృద్రోగ మరణాలు, 14 శాతం స్ట్రోక్‌లతో మరణాలు, 60 శాతం ఊపిరితిత్తుల క్యాన్సర్స్ మరణాలు నమోదు అవుతున్నాయి. పొగాకు వాడినపుడు విడుదల చేయబడే పొగలో వేల కొద్ది రసాయనాలు, 70 వరకు ప్రమాదకర రసాయనాలు విడుదల అవుతున్నాయని తెలుసుకోవాలి. పొగాకు దురలవాటు దీర్ఘకాలం కొనసాగితే ఊపిరితిత్తులు, నోరు, గొంతు, కాలేయం, మూత్ర పిండాలు, క్లోమం, గర్భాశయ, పెద్ద ప్రేగు క్యాన్సర్లకు దారి తీయడంతో పాటు ప్రాణాలను సహితం కోల్పోవడం జరుగుతోంది. పొగాకు ఉత్పత్తుల వాడకంతో ఊపిరితిత్తులు, గుండె, మధుమేహం, టిబీ, కంటి జబ్బులు, స్ట్రోక్ లాంటి ప్రమాదకర వ్యాధులు కలుగుతాయని తెలుసుకోవాలి. గర్భవతులు పొగాకు వాడితే పిల్లల్లో తక్కువ బరువు, ముందస్తు ప్రసవాలు, శిశు అభివృద్ధి మందగించడం కూడా జరుగుతాయి. పొగాకులో ఉన్న నికోటిన్ ప్రభావంతో ప్రాణాంతక పరిస్థితులు వస్తాయి.

పొగాకు ఉత్పత్తుల దురలవాటును తగ్గించడానికి తగు నియమనిబంధనలు, ప్రమాదరక సువాసనలు ఇచ్చే పదార్థాల వినియోగాన్ని నిషేధించడం, నికోటిన్ ఉత్పత్తులను వాడకపోవడం లాంటి చర్యలను తీసుకోవాలని ప్రపంచ దేశాలకు డబ్ల్యూహెచ్ఓ సూచిస్తున్నది. పొగాకు ఉత్పత్తుల అనైతిక మార్కెటింగ్ సరళిని అడ్డుకోవడం, పన్నులను పెంచడం, పొగ రహిత వాతావరణాన్ని నెలకొల్పడం నిరంతరం జరగాలి. ప్రభుత్వాలు, విద్యావేత్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది, పౌర సమాజం సమైక్యంగా కలిసి పోరాడితే పొగాకు రహిత సమాజ స్థాపన సుసాధ్యమని తెలుసుకోవాలి. ఆరోగ్యంగా జీవించడం ఓ మానవ హక్కు అని తెలుసుకొని, పొగాకు దురలవాట్లకు దూరం, సంపూర్ణ ఆరోగ్యకర సమాజానికి దగ్గరగా జీవితాలను సుసంపన్నం చేసుకుందాం, పొగాకు రహిత సమాజాన్ని స్థాపించుకుందాం.



-మధుపాలీ
9949700037

# మానవీయతకు అంకితమవడమే నిజమైన భక్తి: ఉపరాష్ట్రపతి

న్యూ ఢిల్లీ, మే 30:బెంగళూరులో ఈ రోజు నిర్వహించిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ 45 ఏళ్ల అంతర్జాతీయ వేడుకలకు భారత ఉపరాష్ట్రపతి శ్రీ సి. పి. రాధాకృష్ణన్ హాజరయ్యారు. ప్రపంచవ్యాప్తంగా శాంతి, సామరస్యం, సేవాభావం, ఆధ్యాత్మిక చైతన్యాన్ని వ్యాప్తిచేయడంలో సంస్థ కృషిని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు.

సమావేశాన్నుద్దేశించి మాట్లాడుతూ.. ఖండాలను దాటుకుని, ఎన్నో సంస్కృతులు, వివిధ తరాలకు చెందిన లక్షలాది ప్రజల జీవితాలను ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఉద్యమం స్పృశించిందని ఉపరాష్ట్రపతి వ్యాఖ్యానించారు. సంస్థ అంతర్జాతీయ విస్తృతిని వివరిస్తూ.. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 180 దేశాల్లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ కేంద్రాలున్నాయని గుర్తు చేశారు.

'అంతర్గత శాంతే బాహ్య సామరస్యానికి పునాది' అన్న సూత్రంపై నాలుగున్నర దశాబ్దాల కిందట మొదలైన ఈ ఉద్యమం.. కరుణ, స్థైర్యం, ఆనందాలను ప్రోత్సహించే ఒక ప్రధాన మానవతా, ఆధ్యాత్మిక శక్తిగా మారిందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు.

భక్తికి గల ఉన్నతమైన అర్థాన్ని వివరిస్తూ.. భక్తి అంటే కేవలం దైవారాధన మాత్రమే కాదనీ, తన పట్ల, కుటుంబం, సమాజం, దేశం, మొత్తం మానవాళి పట్ల చూపే సంపూర్ణ అంకితభావమే భక్తి అనీ ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. ఇతరులతో కలిసి శాంతియుతంగా జీవించడాన్ని ఆధ్యాత్మికత నేర్పుతుందనీ, అలాగే జీవితాన్ని అర్థవంతంగానూ, సంపూర్ణంగానూ మారుస్తుందని వివరించారు.

ఘర్షణ, అనిశ్చితితో నిండిన ఈ ప్రపంచంలో.. వివేకం, చైతన్యం, శాంతి, సామరస్యం వంటి విలువలతో గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్ మానవాళికి స్ఫూర్తినిస్తున్నారని ఉపరాష్ట్రపతి ప్రశంసించారు. గురుదేవ్ శ్రీ రవిశంకర్ నిరాడంబరత, నమ్రత, కారుణ్యభావం ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలను ప్రభావితులను చేశాయన్నారు.

ధ్యానం, సేవా కార్యక్రమాలు, విద్య, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ చర్యలు, సర్వమత సమ్మేళనాల ద్వారా.. సామాజిక మార్పులో ఆధ్యాత్మికత ఎంతటి కీలక పాత్ర పోషించగలదో ఆర్ట్ ఆఫ్ లివింగ్ నిరూపించిందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. ధ్యానం, ఏకాగ్రతల ప్రాధాన్యాన్ని వివరిస్తూ.. ఏకాగ్ర చిత్తంతో అసాధారణ విజయాలను సాధించవచ్చని ఆయన వ్యాఖ్యానించారు.

మన ప్రాచీన సంస్కృతిని, ఆధునికతను మేళవించి యువత వాటిని ముందుకు తీసుకెళ్లగలిగే స్ఫూర్తిదాయక నమూనాను గురుదేవ్ శ్రీ రవిశంకర్ సమాజం ఎదుట నిలిపారని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. ఆధునికత, ప్రాచీన వారసత్వం ఒకదానికొకటి అనుసంధానమై ఉన్నాయన్న ఆయన.. ఈ సంస్థ సేవా కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం నానాటికీ పెరుగుతుండడంపై అభినందనలు తెలిపారు.

రాక్ సత్సంగ్, భజన్ క్లబ్బింగ్ వంటి సరికొత్త కార్యక్రమాలను ప్రస్తావిస్తూ.. భారత ప్రాచీన విజ్ఞాన సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తంగా యువతను ఆకట్టుకునేలా ఆధునిక రూపంలో ఇలాంటి వినూత్న కార్యక్రమాలు పునరుజ్జీవింపజేస్తున్నాయని ఉపరాష్ట్రపతి అన్నారు.

మాదకద్రవ్య రహిత భారత్ కోసం ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ చేపట్టిన ప్రచారాన్ని ఉపరాష్ట్రపతి ప్రశంసించారు. యువత హానికరమైన వ్యసనాలకు బదులు ఆత్మనియంత్రణ, సానుకూల విలువలతో ముందుకు సాగాలని కోరారు.

ప్రపంచవ్యాప్తంగా రోజు రోజుకూ భారత్ ప్రతిష్ఠ పెరుగుతోందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. నేడు దేశం.. చరిత్రలోనే ఒక గొప్ప సమయంలో ఉందన్నారు. సంపూర్ణమైన ఆత్మవిశ్వాసం, ఉన్నతమైన ఆశయాలతో అంతర్జాతీయ అగ్రగామిగా ఎదుగుతోందని వ్యాఖ్యానించారు. మన ప్రాచీన నాగరికతా విజ్ఞానం, యోగా, ఆరోగ్యం, సుస్థిరత, వసుధైక కుటుంబ భావనలకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇస్తున్న ప్రాధాన్యం.. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ ప్రచారం చేస్తున్న విలువలకు పూర్తిగా అనుగుణంగా ఉందని ఆయన తెలిపారు.

ఈ ఉద్యమంలో భాగస్వాములైన స్వచ్ఛంద సేవకులను ఉపరాష్ట్రపతి ప్రశంసించారు. ప్రపంచంలోని నలుమూలలకూ ఈ మిషన్‌ను చేరవేసిన వారిని 'నిశబ్ద సేవా ప్రదాతలు'గా అభివర్ణించారు. ఒక వ్యక్తిలో వచ్చే సానుకూల మార్పయినా సరే.. కుటుంబం మొత్తాన్నీ సాధికారికం చేస్తుందనీ, తద్వారా సమాజం మొత్తం శక్తిమంతంగా మారుతుందనీ ఆయన వ్యాఖ్యానించారు. ఉపరాష్ట్రపతి ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రాంగణంలోని గణపతి ఆలయంలో ప్రార్థనలు కూడా చేశారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ స్మారక తపాలా బిళ్లను ఆవిష్కరించారు. కర్ణాటక గవర్నర్ శ్రీ థావర్ చంద్ గెహ్లోట్, గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ సభ్యులు, భారత్, విదేశాల ప్రముఖులు, వేలాది మంది భక్తులు, స్వచ్ఛంద సేవకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# భద్రతపై ప్రత్యేక దృష్టి..

## –జిల్లా వ్యాప్తంగా ముమ్మర తనిఖీలు

చిత్తూరు, మే 29: ప్రజల భద్రత, రక్షణను ప్రధాన లక్ష్యంగా తీసుకుని నేరాలు, అక్రమ రవాణా కార్యకలాపాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృత స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.

జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. జిల్లాలోని ప్రధాన పట్టణాలు, గ్రామాలు, చెక్‌పోస్టులు, ముఖ్య రహదారులు, సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టడంతో పాటు వాహనాలను క్షుణ్ణంగా



తనిఖీ చేశారు. పాత నేరస్థులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించారు.

అక్రమ మద్యం, గంజాయి, నిషేధిత వస్తువుల రవాణా, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలను అడ్డుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

ఈ కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం ద్వారా నేరాలను ముందుగానే అరికట్టడంతో పాటు ప్రజల్లో భద్రతా భావన పెంపొందించడమే ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ప్రతి ప్రాంతంలో పోలీసుల సాన్నిధ్యం కనిపించేలా చర్యలు తీసుకోవడం ద్వారా అసాంఘిక శక్తులకు హెచ్చరిక పంపినట్లైందని పేర్కొన్నారు.

తమ పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు లేదా వాహనాలను గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.

అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసుల సహాయం పొందవచ్చని సూచించారు. రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు హెల్మెట్ అవేర్‌నెస్, రోడ్ సేఫ్టీ కార్యక్రమాలు కూడా నిర్వహించారు.

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పోలీసులు సూచించారు. రోడ్డు భద్రత ప్రతి పౌరుడి బాధ్యత అని, చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు.

జిల్లా వ్యాప్తంగా పోలీసు శాఖ సమన్వయం, ప్రజల సహకారంతో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ విజయవంతంగా పూర్తయిందని అధికారులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగించి ప్రజలకు మరింత భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

## అలల ఉద్ధృతితో అప్రమత్తం..

### పర్యాటకులకు కీలక సూచన

అమరావతి, మే 30: ఈదురు గాలుల ప్రభావంతో హంసలదీవి బీచ్ వద్ద అలలు ఉద్ధృతంగా ఎగసిపడుతున్నాయి. అలల తాకిడితో సముద్రం అల్లకల్లోలంగా మారింది.

ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో శనివారం పాలకాయతిప్ప కరకట్ట వద్ద ఉన్న హంసలదీవి బీచ్ గేట్లను మూసి వేస్తున్నట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్.వి.కే. కుమార్ తెలిపారు.

## ప్రపంచ అగ్రశ్రేణి పారిశ్రామిక ప్రముఖులతో న్యూయార్క్‌లో ఉన్నత స్థాయి వ్యాపార, పెట్టుబడి సమావేశాలు నిర్వహించిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్

న్యూ ఢిల్లీ, మే 30:కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ న్యూయార్క్ నగర పర్యటనలో భాగంగా 2026 మే 28న అక్కడ పలు ఉన్నత స్థాయి వ్యాపార, పెట్టుబడి సమావేశాల్లో పాల్గొన్నారు.

కార్లైల్ గ్రూప్ సీఈవో శ్రీ హార్వే స్వార్ట్జ్, మోర్గాన్ స్టాన్లీ ఛైర్మన్, సీఈవో శ్రీ టెడ్ పిక్, వార్‌బర్గ్ పింకస్ ఛైర్మన్ శ్రీ చార్లెస్ కే, అమ్నియల్ ఫార్మాస్యూటికల్స్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో శ్రీ చింటు పటేల్, మాస్టర్‌కార్డ్ సీఈవో శ్రీ మైఖేల్ మీబాచ్‌తో ఒక్కొక్కరిగా ఈ పర్యటన సందర్భంగా మంత్రి సమావేశమయ్యారు.

భారత్ – అమెరికా వాణిజ్య, పెట్టుబడి సంబంధాలను బలోపేతం చేయడం, ప్రపంచ వ్యాపార సంస్థలకు భారత్‌లో అవకాశాలను విస్తరించడం, సరఫరా వ్యవస్థలను పటిష్టం చేయడం, ఆర్థిక సేవలు, ఆరోగ్య రక్షణ, డిజిటల్ చెల్లింపులు, తయారీ, ఆవిష్కరణ, కృత్రిమ మేధ, వర్ధమాన సాంకేతికతల వంటి రంగాల్లో సహకారాన్ని పెంపొందించడంపై ఈ చర్చలు ప్రధానంగా దృష్టి సారించాయి. అంతర్జాతీయ పెట్టుబడుల గమ్యస్థానంగా భారత్‌కు పెరుగుతున్న ఆదరణ కూడా ఈ చర్చల ద్వారా స్పష్టమైంది.

అమెరికా – ఇండియా వ్యూహాత్మక భాగస్వామ్య ఫోరం సహకారంతో నిర్వహించిన ఒక వ్యాపార సమావేశంలో.. పెట్టుబడి, వాణిజ్య వర్గాలకు చెందిన 50 మందికి పైగా ప్రముఖ వ్యాపారాధినేతలనుద్దేశించి మంత్రి ప్రసంగించారు. భారత బలమైన వృద్ధి ప్రయాణం, ప్రస్తుత ఆర్థిక సంస్కరణలు, వ్యాపార సౌలభ్యం, సహకారానికి అవకాశమున్న రంగాలు, కీలక రంగాల్లో పెరుగుతున్న పెట్టుబడి అవకాశాలపై అభిప్రాయాలను పంచుకోవడానికి ఈ సమావేశం అవకాశాన్నిచ్చింది.

# నిత్యావసర వస్తువుల ధరలపై నిరంతర పర్యవేక్షణ



అమరావతి,మే 30:రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలను అదుపులో ఉంచేందుకు ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సచివాలయంలో ధరల స్థిరీకరణపై ఏర్పాటు చేసిన కేబినెట్ ఉపసంఘం సమావేశంలో ఆయన అధికారులకు కీలక సూచనలు చేశారు.

ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నిత్యావసర వస్తువుల ధరల పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, మార్కెట్ పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని మంత్రి నాదెండ్ల సూచించారు.

అంతర్జాతీయ భౌగోళిక, రాజకీయ సంఘర్షణల ప్రభావంతో కొన్ని వస్తువుల ధరల్లో స్వల్ప పెరుగుదల నమోదవుతున్నప్పటికీ, వాటిని నియంత్రించేందుకు ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలపై అదనపు భారం పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ధరల స్థిరీకరణకు సంబంధించి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# గాలివాన దెబ్బకు చీకట్లు..

## –పునరుద్ధరణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు



అమరావతి, మే 30:పశ్చిమగోదావరి జిల్లాలో గత రెండు రోజులుగా వీచిన ఈదురు గాలులు, వర్షాల కారణంగా విద్యుత్ శాఖకు భారీ నష్టం వాటిల్లింది. గురువారం రాత్రి గాలివాన బీభత్సానికి భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పలుచోట్ల రేకుల షెడ్లు, హోర్డింగ్‌లు ఎగిరిపోగా, ఆక్వా చెరువుల వద్ద ఉన్న ఏరియేటర్లు, ఇతర సామగ్రి చెల్లాచెదురయ్యాయి.

ఈదురు గాలుల తీవ్రతకు జిల్లావాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ వ్యవస్థ దెబ్బతినడంతో పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సరఫరా పునరుద్ధరణ కోసం విద్యుత్ శాఖ సిబ్బంది నిరంతరం శ్రమించారు.

గత రెండు రోజుల్లో వీచిన ఈదురు గాలుల కారణంగా జిల్లాలో 237 విద్యుత్ స్తంభాలు నేలవాలాయి. 14.7 కిలోమీటర్ల మేర విద్యుత్ వైర్లు ధ్వంసమయ్యాయి. 17 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. దీంతో విద్యుత్ శాఖకు సుమారు రూ.36.30 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు.

పశ్చిమగోదావరి జిల్లాలోని 33 కేవీ ఫీడర్లు 66, 11 కేవీ ఫీడర్లు 415 పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ శాఖ ప్రత్యేక మరమ్మత్తు బృందాలను ఏర్పాటు చేసి యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టింది.

జిల్లాలోని 96 విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో 7,55,644 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. విద్యుత్ సరఫరా కోసం 34,221 ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేస్తున్నాయి.

గురువారం రాత్రి వీచిన ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు, కండక్టర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడిందని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ ఉషారాణి తెలిపారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం రాత్రి, పగలు తేడా లేకుండా ప్రత్యేక బృందాలతో పనులు చేపట్టామని చెప్పారు.

జిల్లాలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని, మిగిలిన ప్రాంతాల్లో కూడా పనులు కొనసాగుతున్నాయని ఆమె వెల్లడించారు.

# కెనడా-భారత్ సంయుక్త ప్రకటన 2026.. వాణిజ్యం, పెట్టుబడుల సమగ్ర వేదిక

న్యూఢిల్లీ, మే 30:ఇరు దేశాల్లో ఆర్థిక వృద్ధికి, వ్యాపారాల కోసం పెరిగిన వాణిజ్య అవకాశాలకు తోడ్పడే స్పష్టమైన ఫలితాలను అందించేందుకు... ద్వైపాక్షిక వాణిజ్య, పెట్టుబడి సంబంధాల బలోపేతం పట్ల కెనడా, భారత్ మంత్రులు శ్రీ సిధూ, శ్రీ గోయల్‌లు తమ ఉమ్మడి నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఇటీవలి మంత్రుల స్థాయి సమావేశాల ద్వారా సాధించిన పురోగతిని కొనసాగిస్తూ... కెనడాలో పర్యటిస్తున్న భారత వాణిజ్య మంత్రి శ్రీ గోయల్ సహా ఆయన నేతృత్వంలోని అతిపెద్ద భారతీయ ప్రతినిధి బృందానికి ఆ దేశ మంత్రి సిధూ సాదర స్వాగతం పలికారు. పరిశుద్ధ ఇంధనం, కీలక ఖనిజాలు, వ్యవసాయం–ఆహారం, అధునాతన తయారీ, డిజిటల్ టెక్నాలజీలు, నైపుణ్యాభివృద్ధి వంటి అనుబంధ రంగాల్లో సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవడానికి గల అవకాశాలను వారు ప్రధానంగా ప్రస్తావించారు. ప్రతిష్ఠాత్మక, పరస్పర ప్రయోజనకరమైన సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ)ను ముందుకు తీసుకెళ్లడం పట్ల ఇరువురు మంత్రులు తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఈ సంవత్సరం చివరి నాటికి దీనికి సంబంధించిన చర్చలను పూర్తి చేయాలనే ఉమ్మడి లక్ష్యాన్నీ వారు ధ్రువీకరించారు. మార్కెట్‌ను మరింత అందుబాటులో ఉండేలా విస్తరించడం, పటిష్ఠమైన సరుకు రవాణా వ్యవస్థలకు మద్దతునివ్వడం, ఇరు దేశాలు ఆర్థిక వృద్ధిని సాధించడంలో సీఈపీఏ ప్రాముఖ్యాన్ని వారు స్పష్టం చేశారు. కెనడా, భారతీయ వ్యాపార రంగ ప్రముఖులను ఒకచోట చేర్చి, కొత్త వాణిజ్య భాగస్వామ్యాలను పెంపొందించి, వ్యాపార సంబంధాలను వృద్ధి చేసే ఒక కీలక వేదికగా... ఇరు దేశాల మంత్రులు కెనడా–భారత్ వాణిజ్య, పెట్టుబడి ఫోరంను ప్రారంభించారు. వాణిజ్య విస్తరణ, పెట్టుబడులను సులభతరం చేసే అంశాలైన ప్రజల మధ్య సంబంధాలు, వ్యాపార సంబంధిత రాకపోకలు, ప్రత్యక్ష వాణిజ్య అనుసంధానాలు సహా భారత్–కెనడా మధ్య కనెక్టివిటీని మరింత మెరుగుపరచాల్సిన ప్రాముఖ్యతను ఇరు దేశాల మంత్రులు ప్రధానంగా ప్రస్తావించారు.

# ఆపరేషన్ సిందూర్‌పై పుస్తకం.. ఆవిష్కరించిన రక్షణ మంత్రి..

న్యూఢిల్లీ, మే 30:ఆపరేషన్ సిందూర్‌ను వివరించే గ్రంథాన్ని కేంద్ర రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఈ రోజు ఆవిష్కరించారు. ఆపరేషన్ సిందూర్‌లో పాలుపంచుకున్న అధికారులు, నావికులు, వైమానికదళ సిబ్బందితో పాటు ఇతర సైనికులు చెప్పిన 100 కథనాలను దీనిలో చేర్చారు. ఆపరేషన్ సిందూర్‌ను నిర్వహించిన వారికి ఒక ప్రశంసే ఈ పుస్తకం.. ఇది జవానుల అంకిత భావానికి, వారి ధీరత్వానికి నిదర్శనం అని రక్షణ మంత్రి సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఓ సందేశంలో పేర్కొన్నారు. "పౌరులు ఈ పుస్తకం చదివి స్ఫూర్తిని పొందాలి. దేశ భద్రతను పరిరక్షించడానికి, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడటానికి జాతి చెల్లించే భారీ వెలకు దీటైన మెరికలుగా పౌరులు తయారవాలి'' అని ఆయన అన్నారు.

"ఆపరేషన్ సిందూర్ ఇదివరకు ఎప్పుడూ కని విని ఎరుగని విజయం, దీనిలో నాలుగు రోజుల్లోపే కాల్పుల విరమణను కోరక తప్పని స్థితిని పాకిస్థానుకు భారత్ కల్పించింది'' అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. భారత్ ఇంతవరకు చేసిన యుద్ధాల కన్నా ఇది పూర్తి భిన్నమైందని, ఈ స్మృతి గ్రంథం సాంప్రదాయిక కథనాలకు మించి, వీర సైనికుల అనుభవాల్ని పాఠకుల కళ్లకు కడుతుందని ఆయన పేర్కొన్నారు. అలాగే ఆధునిక యుద్ధతంత్రానికి సంబంధించి మనిషి దృష్టికోణాన్ని కూడా ఈ పుస్తకం పూసగుచ్చినట్టు వివరిస్తుందని, నాయకత్వం, ధైర్య సాహసాలు, ఒత్తిడి నడుమ కర్తవ్య పాలన, నిబద్ధత.. ఇవన్నీ కలగలిసి వ్యూహానికి విజయ రూపాన్ని సంతరించి పెట్టాయని ఆయన అన్నారు.

సైన్య అధికారులు గతంలో ఎలా పనిచేసేవారన్న అంశాలను ఈ సంపుటిలో ఉద్దేశపూర్వకంగా పక్కన పెట్టారు. యుద్ధాల కథనాలు చాలావరకూ ప్రధాన కేంద్రం, యుద్ధ కార్యకలాపాల్ని నిర్దేశించేందుకు ఏర్పాటు చేసే ప్రత్యేక కార్యాలయం కథనాలనే అందిస్తాయి. కమాండర్ల నిర్ణయాలే నమోదవుతాయి, వాటిపైనే విశ్లేషణలు, చర్చలు చోటుచేసుకుంటాయి. యుద్ధం పోకడ మాత్రం తెరకు వెనుకే ఉండిపోతుంది.. ఎలాగంటే పోరు బరిలో నియంత్రణ రేఖ వద్ద నిలబడి విరోధి బంకర్లపైన కనురెప్పలు వాల్చక ఆయుధాన్ని గురిపెట్టే జవాను, సరిహద్దు లోపలికి దూసుకొచ్చే డ్రోన్ల జాడను పసిగట్టి వాటిని కూల్చేసే వాయు రక్షణ రేఖ ఆపరేటరు, ఆయుధాలను వెదజల్లే యుద్ధ విమాన పైలట్, యుద్ధనౌకల సమూహం కీలక స్థావరం నుంచి ముందుకు సాగిపోయే వేళ అత్యంత అప్రమత్తంగా ఉండే నావికుడు.. వీరందరి సాహస కృత్యాలు చరిత్ర పుటలకెక్కే సందర్భాలు ఇంచుమించు ఎంతో అరుదు.

అలాంటి ఘటనల్ని రోమాంచితంగా వివరించే ప్రయత్నాన్ని చేశారు ఈ పుస్తకంలో. దీనిలో ప్రధానకేంద్రం, ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్‌తో పాటు త్రివిధ దళాలకు చెందిన ఉదంతాల్ని గుదిగుచ్చారు. అలాగే గగనతలాన పోరాడిన ఏవియేటర్లు, ఉపరితలం నుంచి నింగిలోకి క్షిపణుల్ని ప్రయోగించిన సిబ్బంది, నౌకా సంరక్షకులు, ప్రత్యేక దళాల ఆపరేటర్లు, సిగ్నలర్లు, చలన తంత్ర నిపుణులు, వైద్యాధికారులు, తదితర యోధులు కలిసికట్టుగా కదిలి ఆపరేషన్‌ను విజయ తీరానికి చేర్చారని చాటిచెప్పారు.

ఈ పుస్తకాన్ని డిఫెన్స్ స్టాఫ్ చీఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్, నౌకాదళ ప్రధానాధికారి అడ్మిరల్ దినేశ్ కె. త్రిపాఠీ, సైన్య ప్రధానాధికారి జనరల్ ఉపేంద్ర ద్వివేదీ, వైమానిక దళ ప్రధానాధికారి ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి. సింగ్ ల సమక్షంలో న్యూఢిల్లీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆవిష్కరించారు.

సీడీఎస్ మార్గదర్శకత్వంలో ఈ సంపుటిని సంకలన పరిచారు. సాయుధ దళాల సిబ్బంది కథనాల్ని స్ట్రాటజిక్ కమ్యూనికేషన్ అడిషనల్ డైరెక్టరేట్ జనరల్, మీడియా పబ్లిక్ ఇన్ఫర్మేషన్ సెల్‌లతో పాటు మీడియా పబ్లిక్ రిలేషన్స్ డైరెక్టరేట్‌లు అందించగా గ్రంథ ప్రచురణకు ఇండియా యునైటెడ్ సర్వీస్ ఇనిస్టిట్యూషన్ తోడ్పడింది.

# భక్తుల కోసం తిరుమలలోకి మరో ఆధునిక సేవ

తిరుమల, తిరుపతి, మే 30: తిరుమల తిరుపతి దేవస్థానానికి ఢిల్లీలోని నయాతి హెల్త్ కేర్ అండ్ రీసెర్చ్ ఆగ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ శనివారం రూ.1.13 కోట్ల విలువైన ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సును విరాళంగా అందించింది.

ఈ సందర్భంగా సంస్థ అధినేత నీరా రాడియా శ్రీవారి ఆలయం ముందు బస్సుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బస్సుకు సంబంధించిన పత్రాలు, తాళాలను టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరికి అందజేశారు.

కార్యక్రమం అనంతరం టీటీడీ ఛైర్మన్, అదనపు ఈవో దాతతో కలిసి బస్సులో ప్రయాణించారు. ప్రయాణికులకు ఈ బస్సు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొంటూ దాతను అభినందించారు. భక్తుల సౌకర్యార్థం ఈ ఎలక్ట్రిక్ బస్సును తిరుమలలో ఉచిత బస్సు సేవగా వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, టీటీడీ మాజీ బోర్డు సభ్యులు డి.పి. అనంత, తిరుమల ట్రాన్స్‌పోర్ట్ డీఐ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

-ఎన్డీఏ కార్యాలయంలో ప్రజా దర్బార్
-ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆధ్వర్యంలో..
-పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ
-సంక్షేమం-అభివృద్ధి రెండింటికీ ప్రభుత్వం సమాన ప్రాధాన్యం
-ప్రజల అభిప్రాయాలతోనే తదుపరి కార్యాచరణ



అమరావతి, మే 30:ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడమే లక్ష్యంగా భవానీపురంలోని ఎన్డీఏ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి, వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే అర్హులైన పేదలకు ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, గత రెండు సంవత్సరాలుగా ప్రజా సంక్షేమాన్ని ఏ మాత్రం విస్మరించకుండా అనేక పథకాల ను అమలు చేస్తోందన్నారు.

ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్ల పంపిణీతో పాటు ఇతర సంక్షేమ పథకాలకు కూడా సకాలంలో నిధులు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి విడతల వారీగా లబ్ధిదారులకు అందజేస్తున్నామని తెలిపారు. వేల కోట్ల రూపాయల వ్యయంతో మౌలిక సదుపాయాల పనులు పూర్తి చేసి మిగిలిన ఇళ్లను కూడా త్వరలో పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ సేవలతో పాటు సుజనా ఫౌండేషన్ ద్వారా ప్రజలకు వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్నామని చెప్పారు.

ప్రతి శని, ఆదివారాల్లో ఉచిత సంచార వైద్య వాహనం ద్వారా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని వివరించారు. విద్యా రంగంలో తీసుకొచ్చిన సంస్కరణల ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరిగిందన్నారు. ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా త్వరలో నియోజకవర్గంలో సమావేశాలు నిర్వహించి ప్రజల అభిప్రాయాలు, సూచనలు స్వీకరిస్తామని ఎమ్మెల్యే సుజనా చౌదరి తెలిపారు. ప్రజా దర్బార్ ద్వారా అందిన ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# సింహవాహనంపై సుదర్శన నరసింహుడిగా కల్యాణ వేంకటేశ్వరుడు



తిరుపతి, మే 29:శ్రీ గోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన శనివారం రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గోవింద నామస్మరణలతో తిరువీధులు మార్మోగగా, వేలాది మంది భక్తులు భక్తి శ్రద్ధలతో రథాన్ని లాగి తమ భక్తిని చాటుకున్నారు.

ఉదయం 5.40 గంటలకు ప్రారంభమైన రథోత్సవం కర్ణాల వీధి, బేరి వీధి, గాంధీ రోడ్డు మీదుగా సాగి తిరిగి ఆలయ రథమండపానికి చేరుకుంది. మార్గమంతా భక్తులు టెంకాయలు కొట్టి, కర్పూర హారతులు సమర్పిస్తూ స్వామివారికి మంగళారతులు అర్పించారు.

రథోత్సవం కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాకుండా ఆత్మజ్ఞానాన్ని బోధించే తాత్త్విక సందేశాన్ని కూడా అందిస్తుంది. ఆత్మను రథికుడిగా, శరీరాన్ని రథంగా, బుద్ధిని సారథిగా, మనసును పగ్గంగా, ఇంద్రియాలను గుర్రాలుగా, విషయాలను వీధులుగా భావించడం ద్వారా ఆత్మ?అనాత్మ వివేకాన్ని ఈ ఉత్సవం భక్తులకు తెలియజేస్తుంది.

రథోత్సవం అనంతరం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామివారికి, నమ్మాళ్వార్ల ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, వివిధ పండ్ల రసాలతో విశేష అభిషేకం చేశారు.

నేడు సాయంత్రం 5.30 గంటల నుంచి 6 గంటల వరకు ఊంజల్‌సేవ జరగనుంది. అనంతరం రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు అశ్వవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

రథోత్సవంలో శ్రీ శ్రీ శ్రీ పెద్ద జీయర్ స్వామి, శ్రీ శ్రీ శ్రీ చిన్న జీయర్ స్వామి, టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాశ్ రెడ్డి, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో నారాయణ చౌదరి, ఆలయ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, పోలీసు అధికారులు, శ్రీవారి సేవకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మే 31న కపిలతీర్థం (ఆళ్వార్ తీర్థం)లో చక్రస్నానం వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి 9.30 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమం కోసం ఉదయం 6 గంటలకు స్వామివారు, అమ్మవార్లు తిరుచ్చిపై, చక్రతాళ్వార్ పల్లకిలో కపిలతీర్థానికి ఊరేగింపుగా బయలుదేరనున్నారు.

చక్రస్నానం అనంతరం పీఆర్ తోటకు వేంచేపు చేసి, సాయంత్రం 6 గంటలకు తిరిగి ఆలయానికి చేరుకుంటారు.

# న్యూఢిల్లీలోని ఐజీఐ విమానాశ్రయంలో భారత తొలి 'స్కైకాస్ట్' వ్యవస్థను ప్రారంభించిన కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, మే 30:కేంద్ర శాస్త్రసాంకేతికం, భూవిజ్ఞానం (స్వతంత్ర), ప్రధానమంత్రి కార్యాలయం, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పింఛన్లు, అణు ఇంధనం, అంతరిక్ష శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్... ఈ రోజు న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారత తొలి "స్కైకాస్ట్ వ్యవస్థ"ను ప్రారంభించారు. భారత విమానయాన రంగంలో ఇది ఒక నూతన శకానికి నాంది అని ఆయన పేర్కొన్నారు.

ప్రపంచవ్యాప్తంగా ఇప్పటి వరకు ఇలాంటి అధునాతన వ్యవస్థలు 18 మాత్రమే ఉన్నాయనీ, విమానయాన వాతావరణ పర్యవేక్షణ కోసం ఈ సమీకృత వాతావరణ రిమోట్ సెన్సింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసిన ప్రపంచంలోని 19వ దేశంగా భారత్ నిలిచిందని కేంద్ర మంత్రి తెలిపారు. ఢిల్లీలోని ఐజీఐ విమానాశ్రయం తర్వాత, రెండో విమానాశ్రయంగా జేవార్ విమానాశ్రయంలో ఇలాంటి సదుపాయం ఏర్పాటు కానుందని తెలిపారు. త్వరలోనే దేశంలోని ఇతర విమానాశ్రయాలకూ దీనిని విస్తరిస్తామని ఆయన అన్నారు.

భూవిజ్ఞాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ ఎం. రవిచంద్రన్... భూవిజ్ఞాన మంత్రిత్వ శాఖ, భారత వాతావరణ శాఖ, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటీయోరాలజీ, జీఎమ్ఆర్ సంస్థల సీనియర్ అధికారులు, విమానయాన రంగ ప్రతినిధుల సమక్షంలో న్యూఢిల్లీలోని ఐజీఐ విమానాశ్రయంలో ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. గ్లైడ్ పాత్ 10 వద్ద స్కైకాస్ట్ సిస్టమ్, ఫాగ్ అబ్జర్వేటరీ కేంద్రాన్ని డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రారంభించారు. అనంతరం ఐఐటీఎమ్ శాస్త్రవేత్తలు సాంకేతిక వివరణ, ప్రదర్శనను ఇచ్చారు.

ఇలాంటి అత్యాధునిక వాతావరణ మౌలిక సదుపాయాలను సుసాధ్యం చేసే 'మిషన్ మౌసమ్' ప్రణాళిక రూపకల్పనకు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతే కారణమని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. క్లిష్టమైన వాతావరణ పరిస్థితుల్లో పైలట్‌లకు, విమానయాన ఆపరేటర్లకు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందించడం ద్వారా స్కైకాస్ట్... విమానయాన భద్రతలో ఒక పెద్ద పరివర్తనను తీసుకువస్తుందని ఆయన అన్నారు.

పొగమంచు, కుదుపుల వల్ల విమాన ప్రయాణాలకు కలిగే అంతరాయాలు గణనీయంగా తగ్గే భవిష్యత్తును ప్రయాణికులు ఆశించవచ్చని కేంద్ర మంత్రి అన్నారు. ఈ వ్యవస్థ విమాన సిబ్బందికి, పైలట్లకు సుమారు మూడు గంటల స్వల్ప వ్యవధిలోనే ముందస్తు హెచ్చరికలు అందిస్తుందనీ, తద్వారా వారు విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేయడానికి సమయాన్ని నిర్ణయించుకోవడంతో పాటు అనవసరమైన దారి మళ్లింపులు, రద్దులు, ఆలస్యాలను నివారించవచ్చని ఆయన తెలిపారు.

పొగమంచు పర్యవేక్షణ, గాలిలో కుదుపులను గుర్తించడం, అధిక ప్రభావం చూపే వాతావరణ సూచనల కోసం బహుళ వాతావరణ పరిశీలన సాంకేతికతలను మిళితం చేయడం ద్వారా స్కైకాస్ట్ భారత విమానయాన చరిత్రలో ఒక అతిపెద్ద విజయంగా నిలుస్తుందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. సమగ్రమైన తాజా వాతావరణ సమాచారాన్ని అందించడానికి రాడార్ విండ్ ప్రొఫైలర్, సోడార్, మైక్రోవేవ్ రేడియోమీటర్, గ్రౌండ్-బేస్డ్ ఫాగ్ ఏరోసోల్ స్పెక్ట్రోమీటర్ (జీఎఫ్ఏఎస్), సీఎల్61 లిడార్-ఆధారిత సీలోమీటర్ వంటి అత్యాధునిక వాతావరణ రిమోట్ సెన్సింగ్ సాంకేతికతలను ఈ వ్యవస్థ అనుసంధానిస్తుంది. ఈ సదుపాయం రన్‌వేల వ్యాప్తంగా పర్యవేక్షణను, హెచ్చరిక సామర్థ్యాలను బలోపేతం చేయడంతో పాటు... టేకాఫ్‌లు, ల్యాండింగ్‌లను మరింత సురక్షితం చేస్తుందని ఆయన అన్నారు.

ఒక అధునాతన బౌండరీ లేయర్ రాడార్ విండ్ ప్రొఫైలర్ స్కైకాస్ట్‌లో ప్రధాన భాగంగా ఉంటుందనీ, ఇది విమానాశ్రయానికి దాదాపు 3 కిలోమీటర్ల ఎత్తు వరకు గాలి వేగం, గాలి దిశ, కుదుపులు, నిలువు దిశలో వేగం, బౌండరీ-లేయర్ డైనమిక్స్‌ను నిరంతరం కొలుస్తుందని కేంద్ర మంత్రి తెలిపారు. విమానాలు కిందికి దిగేటప్పుడు, ల్యాండింగ్ చేసేటప్పుడు ఈ అంశాలు చాలా కీలకమైనవిగా ఉంటాయి. కచ్చితమైన వాతావరణ సమాచారం భద్రతను మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

స్కైకాస్ట్ సదుపాయంలో గ్రౌండ్-బేస్డ్ ఫాగ్ ఏరోసోల్ స్పెక్ట్రోమీటర్ (జీఎఫ్ఏఎస్) వంటి అధునాతన పొగమంచు పర్యవేక్షణ పరికరాలు ఉన్నాయి. ఇది పొగమంచు బిందువులు, ఏరోసోల్స్, ఏరోసోల్- పొగమంచు పరస్పర చర్యలపై వివరణాత్మక సమాచారాన్ని అందిస్తుంది. ఢిల్లీ వంటి నగరాలకు ఇది చాలా ముఖ్యమనీ, అక్కడ కాలుష్య కణాలు పొగమంచుతో చర్య జరిపి దృశ్యమాన పరిస్థితులను ప్రభావితం చేస్తాయని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

ఈ వ్యవస్థలో సీఎల్61 లిడార్ ఆధారిత సీలోమీటర్‌నూ అనుసంధానించారు. ఇది పొగమంచు వర్టికల్ స్ట్రక్చర్‌ను నిరంతరం పర్యవేక్షిస్తుంది. ఇది పొగమంచు ఏర్పడటం, దృశ్యమానత తగ్గుదల, విమానయాన కార్యకలాపాలను ప్రభావితం చేసే వాతావరణ పరిస్థితులను అర్థం చేసుకోవడానికి సహాయ పడుతుంది.

పొగమంచు, ఏరోసోల్స్, కుదుపులు, తేమ, దృశ్యమానత, వాతావరణ పరిస్థితులకు సంబంధించి తాజా వివరాలను స్కైకాస్ట్ కచ్చితమైన సమాచారంతో ఒకే అధునాతన విమానయాన వాతావరణ నిఘా విధానంలో ఏకీకృతం చేస్తుంది. ఈ వ్యవస్థ పైలట్లు, విమానయాన సంస్థలు, విమానాశ్రయ నిర్వాహకులు, విమాన ట్రాఫిక్ నిర్వహణ ఏజెన్సీలకు కచ్చితమైన నౌకాస్టింగ్, ముందస్తు హెచ్చరిక సేవలతో మద్దతునిస్తుంది.

2015లో ఐజీఐ విమానాశ్రయంలో భూవిజ్ఞాన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఐఐటీఎం, ఐఎండీ సంయుక్తంగా ప్రారంభించిన శీతాకాలపు పొగమంచు ప్రయోగం (వైఫెక్స్) ఈ స్కైకాస్ట్ వ్యవస్థకు శాస్త్రీయ పునాది. వైఫెక్స్ వ్యవస్థ పొగమంచు ఏర్పడటం, ఏరోసోల్-మేఘాల పరస్పర చర్యలు, దృశ్యమానత తగ్గింపు, అర్బన్ బౌండరీ-లేయర్ ప్రక్రియలపై కీలకమైన అవగాహనను కల్పించింది. ఇది ఈ తదుపరి తరం కార్యాచరణ వ్యవస్థ అభివృద్ధికి దోహదపడింది.

శాస్త్రీయ ఆవిష్కరణలు, అధునాతన వాతావరణ సాంకేతిక పరిజ్ఞానాల ద్వారా భారత్ "పొగమంచు రహిత విమానాల" శకం వైపు పయనిస్తోందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. విమానయానాన్ని "హవాయి చప్పల్ నుంచి హవాయి జహాజ్" స్థాయికి తీసుకెళ్లాలన్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతను ప్రస్తావిస్తూ... విమానయాన రంగానికీ, పౌరులకూ ప్రయోజనం చేకూర్చేందుకు భారత్ ఇప్పుడు వాతావరణ సేవలను అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చే దిశగానూ పురోగమిస్తోందని కేంద్ర మంత్రి తెలిపారు.

భూవిజ్ఞాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ ఎం. రవిచంద్రన్ మాట్లాడుతూ... స్కైకాస్ట్ కేంద్రం విమానయాన కార్యకలాపాలకు మద్దతునివ్వడమే కాకుండా, భారత మొత్తం వాతావరణ అంచనా సామర్థ్యాలనూ బలోపేతం చేస్తుందన్నారు. ఇటువంటి అధునాతన పరికరాల ద్వారా ఉత్పత్తయ్యే గాలి, తేమ, ఉష్ణోగ్రతల వర్టికల్ ప్రొఫైల్స్ భవిష్యత్ వాతావరణ అంచనాలను మెరుగుపరుస్తాయని ఆయన తెలిపారు. వాతావరణ వ్యవస్థలను మరింత మెరుగ్గా పర్యవేక్షించేందుకుగానూ మిషన్ మౌసమ్ కింద డాప్లర్ వెదర్ రాడార్లు, ఇలాంటి వ్యవస్థలు సహా అధునాతన పరిశీలన నెట్‌వర్క్‌లనూ భారత్ వ్యాప్తంగా విస్తరిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఇలాంటి కేంద్రాలు మరింత నాణ్యమైన వాతావరణ సమాచారాన్ని ఉత్పత్తి చేస్తాయనీ, ఇది రాబోయే సంవత్సరాల్లో వాతావరణ అంచనా కచ్చితత్వాన్ని గణనీయంగా మెరుగుపరుస్తుందని డాక్టర్ రవిచంద్రన్ అన్నారు. ఈ సాంకేతికతలను విమానాశ్రయాలు, దేశంలోని ఇతర ప్రాంతాల్లో మరింత ఎక్కువగా విస్తరించి... వాతావరణ అంచనా సామర్థ్యాలను మరింత మెరుగుపరచడానికి విమాన ఆధారిత పరిశీలనలనూ దానికి అనుసంధానిస్తారని ఆయన పేర్కొన్నారు.

విమానయాన రంగంతో పాటు... అధునాతన వాతావరణ సూచన నమూనాలు, కృత్రిమ మేధస్సు ఆధారిత నిర్ణయ సహాయక వ్యవస్థలు, పట్టణ వాతావరణ సూచన, కాలుష్య నిర్వహణ, రవాణా సలహాలు, విపత్తు సంసిద్ధతా కార్యక్రమాలకూ స్కైకాస్ట్ పరిశీలనలు మద్దతునిస్తాయి. మిషన్ మౌసమ్ కింద రూపొందించిన స్కైకాస్ట్ సిస్టమ్... వాతావరణ-స్మార్ట్ మౌలిక సదుపాయాలను నిర్మించడం, విమానయాన సామర్థ్యాల బలోపేతం, శాస్త్రీయ ఆవిష్కరణల ద్వారా సురక్షితమైన, మరింత విశ్వసనీయమైన సేవలను అందించడం పట్ల భారత్ నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న 'రా కింగ్'

## -దాసరి ఘాట్ పునరుద్ధరణకు మనోజ్ ముందడుగు




అమరావతి, మే 30:లెజెండరీ దర్శకుడు, దర్శకరత్న దాసరి నారాయణరావుపై తనకున్న గౌరవాన్ని నటుడు మనోజ్ మంచు మరోసారి చాటుకున్నారు. దాసరి ఘాట్ దుస్థితికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వెంటనే స్పందించిన మనోజ్, స్వయంగా అక్కడికి చేరుకుని పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఆయన చర్యకు సినీ అభిమానులు, నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.

యాంకర్ గౌతమి సోషల్ మీడియాలో షేర్ చేసిన వీడియోలో దాసరి ఘాట్ పరిసరాల దయనీయ పరిస్థితి కనిపించడంతో మనోజ్ మంచు స్పందించారు. "దాసరి గారి ఘాట్ చుట్టూ ఉన్న పరిస్థితి చూసి చాలా బాధ కలిగింది. తెలుగు సినిమా పరిశ్రమకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం. ఈ విషయాన్ని నా దృష్టికి తీసుకొచ్చినందుకు ధన్యవాదాలు. నా వంతు సహాయం తప్పకుండా చేస్తాను'' అంటూ సోషల్ మీడియాలో హామీ ఇచ్చారు.

ఇచ్చిన మాట ప్రకారం మరుసటి రోజే ఉదయం తన బృందంతో కలిసి దాసరి ఘాట్‌ను సందర్శించారు. అక్కడ పేరుకు పోయిన చెత్త, ఎండుటాకులను తొలగిస్తూ శుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. "మూడు, నాలుగేళ్ల క్రితం ఇక్కడికి వచ్చాను. ఇప్పుడు ఈ పరిస్థితి చూసి తట్టుకోలేకపోయాను. అందుకే షూటింగ్‌కు వెళ్లే ముందు ఇక్కడికి వచ్చి ఈ పనిని ప్రారంభించాను'' అని మనోజ్ తెలిపారు.

ఇటీవల మనోజ్, మౌనికా కలిసి ప్రారంభించిన 'ఐక్య ధైర్య సేనా సమితి' ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. రక్తదాన శిబిరాలు, సహాయక కార్యక్రమాలు, అనాథాశ్రమాల సందర్శనలతో పాటు ఇప్పుడు దాసరి నారాయణరావు ఘాట్ పునరుద్ధరణలోనూ ముందుండడం ఆయన సామాజిక బాధ్యతను చాటుతోందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

పలమనేరు
సృజనసాహితీ పురస్కారం-2025
ప్రదానోత్సవ సభ

పురస్కార గ్రహీత:
కవియాకూబ్
ప్రముఖ కవి, కవిసంగమం నిర్వాహకులు

వేదిక:
పలమనేరు కళా మందిరం,
పలమనేరు, చిత్తూరు జిల్లా

తేదీ, సమయం:
7 జూన్ 2026 (ఆదివారం)
ఉ. 10 గంటలకు.

అధ్యక్షత:
జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి

వక్తలు:
-యాకూబ్ సాహిత్య ప్రస్థానం:
డా. సీతారాం
-యాకూబ్ సాహిత్య వ్యక్తిత్వం:
పల్లిపట్టు నాగరాజు
కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత

సభ నిర్వహణ:
- పలమనేరు బాలాజి
& పి.తులసీనాథం నాయుడు
- పలమనేరు రచయితల సంఘం,
చిత్తూరు జిల్లా రచయితల సమాఖ్య,
తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి,
పలమనేరు, చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

# టీడీపీతోనే మహిళల అభ్యున్నతి సాధ్యం



అమరావతి,మే 30:మహిళల అభ్యున్నతి, సాధికారత తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన నేపథ్యంలో శనివారం మహిళలతో కలిసి స్థానిక బస్టాండ్ నుంచి సత్యమ్మ గుడి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు.

అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే మహిళా సాధికారత లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ఆర్థిక, రాజకీయ రంగాల్లో మహిళలు బలోపేతం కావాలనే సంకల్పంతో పార్టీ ముందుకు సాగుతోందని చెప్పారు.

మహిళల విద్యాభివృద్ధికి దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ మహిళా విశ్వవిద్యాలయాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, గురుకులాలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. మహిళలకు ఆస్తి హక్కు కల్పించడం ఆయన దూరదృష్టికి నిదర్శనమన్నారు.

దీపం పథకం ద్వారా మహిళల ఆరోగ్య పరిరక్షణకు చంద్రబాబు నాయుడు కృషి చేశారని, ప్రస్తుతం ప్రతి ఏడాది మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమేనని తెలిపారు.

'తల్లికి వందనం' పథకం ద్వారా కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉన్నా ప్రతి ఒక్కరికీ ప్రయోజనం కల్పిస్తున్నామని చెప్పారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది తల్లుల ఖాతాల్లో నేరుగా ఆర్థిక సహాయం జమ చేయనున్నట్లు వివరించారు.

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా రంగంలో సంస్కరణలు తీసుకొస్తూ విద్యార్థుల భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి దోహదపడుతున్నాయని అన్నారు.

స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్, శ్రీశక్తి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి కార్యక్రమాలు మహిళా సంక్షేమానికి నిదర్శనమని చెప్పారు. రానున్న రోజుల్లో మహిళలు ఎమ్మెల్యేలు, ఎంపీలుగా మరింతగా చట్టసభల్లో ప్రాతినిధ్యం వహిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

మహిళలతో పాటు రాష్ట్ర ప్రజలందరికీ మెరుగైన భవిష్యత్తు అందించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి అధికారులకు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, తెలుగుదేశం పార్టీ మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పొగాకు ఉత్పత్తుల నమూనాల సేకరణ కోసం ప్రామాణిక కార్యాచరణ విధానం విడుదల

న్యూఢిల్లీ, మే 30:ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం (డబ్ల్యూఎన్‌టీడీ) 2026 సందర్భంగా పొగాకు రహిత విద్యా సంస్థల (టీఎఫ్ఈఐ) పైలట్ అప్లికేషన్‌ను న్యూఢిల్లీలోని కర్తవ్య భవన్‌లో కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి శ్రీమతి పుణ్య సలీల శ్రీవాస్తవ ప్రారంభించారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన జాతీయ సదస్సులో దీనిని ప్రారంభించారు. పొగాకు, నికోటిన్ వ్యసనం వల్ల కలిగే భయంకరమైన ఆరోగ్య, సామాజిక, ఆర్థిక, పర్యావరణ నష్టాల నుంచి ప్రస్తుత, రాబోయే తరాలను రక్షించేందుకు భారత్ కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆమె వెల్లడించారు.

టీఎఫ్ఈఐ అనేది, దేశంలోని పాఠశాలలు, కళాశాల్లో పొగాకు రహిత నిబంధనల అమలును, పర్యవేక్షణను మరింత బలోపేతం చేయడం కోసం తీసుకువచ్చిన ఒక డిజిటల్ కార్యక్రమం.

ఈ డిజిటల్ వేదికలో ఉండే ప్రామాణిక పర్యవేక్షణ, నివేదికలు, నిబంధనల పరిశీలన పద్ధతులు రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు, విద్యాసంస్థలకు, అధికారులకు ఎంతగానో సహాయపడతాయి. దీనివల్ల జవాబుదారీతనం పెరుగుతుంది. అలాగే పిల్లలు, యువతకు ఆరోగ్యకరమైన, పొగాకు లేని వాతావరణం లభిస్తుంది. మొదటి విడతగా (పైలట్ ప్రాజెక్ట్‌గా) ఈ అప్లికేషన్‌ను రాజస్థాన్, మేఘాలయ, మహారాష్ట్ర రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారు. యాప్ పనితీరును అంచనా వేయడానికి, నివేదికల పద్ధతులను బలోపేతం చేయడానికి, భవిష్యత్తులో దేశవ్యాప్తంగా విస్తరించడానికి ఇది ఉపయోగపడుతుంది.

ఈ సందర్భంగా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పొగాకు ఉత్పత్తుల నమూనాల సేకరణ కోసం ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని విడుదల చేసింది. మార్కెట్లో దొరికే పొగాకు ఉత్పత్తులపై నిఘాను పెంచడానికి, నిబంధనలు సరిగ్గా అమల య్యేలా చూడటానికి, వాటి నాణ్యతను పరీక్షించడానికి ఇది ఉపయోగపడుతుంది. పొగాకు ఉత్పత్తుల పరీక్షల్లో ఎలాంటి తప్పులు లేకుండా నమ్మకంగా జరగడం కోసం ఈ నమూనాలను ఎలా సేకరించాలి, ఎలా భద్రపరచాలి, ఎలా రవాణా చేయాలి, వాటికి సంబంధించిన పత్రాలను ఎలా సభను ఉద్దేశించి కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి శ్రీమతి పుణ్య సలీల శ్రీవాస్తవ మాట్లాడుతూ... ఈ ఏడాది ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం ముఖ్య ఉద్దేశమైన "ఆకర్షణల ముసుగు తొలగిద్దాం-నికోటిన్, పొగాకు వ్యసనాన్ని అడ్డుకుందాం"అనేది యువతను, రాబోయే తరాలను పొగాకు, నికోటిన్ వ్యసనం వల్ల కలిగే హానికరమైన ప్రభావాల నుంచి రక్షించడంలో చాలా కీలకపాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

పొగాకు, నికోటిన్ ఉత్పత్తులను యువతకు ఆకర్షణీయంగా కనిపించేలా కంపెనీలు రూపొందించి చేసి మార్కెటింగ్ చేస్తున్నాయని ఆమె తెలిపారు. ముఖ్యంగా ఆకర్షణీయమైన రుచులు, రంగురంగుల ప్యాకేజింగ్, పొగాకు పేరు నేరుగా వాడకుండా పరోక్ష ప్రకటనలు, సోషల్ మీడియా, డిజిటల్ వేదికలపై చూపే రంగుల ప్రపంచంతో యువతను ఆకర్షిస్తున్నారని చెప్పారు. ఇలాంటి వ్యూహాల వల్ల పొగాకు, నికోటిన్ వాడకంపై యువతలో ఒక తప్పుడు అభిప్రాయం ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందుకే యువత ఎల్లప్పుడూ నిజాలు తెలుసుకుని, అప్రమత్తంగా ఉంటూ, పొగాకు ఉత్పత్తులను పూర్తిగా తిరస్కరించేలా వారిలో పెద్ద ఎత్తున అవగాహన కల్పించడం చాలా ముఖ్యమని ఆమె తెలిపారు.

నికోటిన్, పొగాకు వ్యసనాన్ని అడ్డుకోవడానికి ప్రభుత్వం తీసుకుంటున్న సమగ్ర వ్యూహంలో భాగంగా నేడు ప్రారంభించిన ఈ రెండు కార్యక్రమాలు చాలా కీలకమైనవని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి పేర్కొన్నారు.

పొగాకు ఉత్పత్తుల నమూనాల సేకరణ కొరకు విడుదల చేసిన ప్రామాణిక కార్యాచరణ విధానం గురించి ఆమె మాట్లాడుతూ.. పొగాకు నియంత్రణ ప్రయత్నాలలో చట్టపరమైన, నిబంధనల అమలు యంత్రాంగాలను బలోపేతం చేయడం చాలా కీలకమైన భాగమని పేర్కొన్నారు. పొగాకు నియంత్రణ చట్టాలు సమర్థవంతంగా అమలు కావాలన్నా, చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నా.. శాస్త్రీయ పద్ధతిలో నమూనాలను సేకరించడం, సరైన పద్ధతిలో వాటిని పరీక్షించడం, సేకరణ నుంచి పరీక్షల వరకు ప్రతి దశలోనూ పారదర్శకత లోపించకుండా చూసుకోవడం చాలా అవసరమని చెప్పారు. ఈ ఎస్ఓపీ అనేది నిబంధనలను ఒకేలా మార్చడానికి సహాయపడుతుందని, నియంత్రణ, అమలు ప్రయత్నాలను బలోపేతం చేయడంలో రాష్ట్రాలకు, క్షేత్రస్థాయిలో పనిచేసే సంస్థలకు అండగా నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు.

పొగాకు రహిత విద్యాసంస్థల పైలట్ అప్లికేషన్ ప్రారంభం గురించి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఉన్న జిల్లా ఆసుపత్రులు, వైద్య కళాశాలలు, దంత వైద్య కళాశాలలు, ఆయుష్ సంస్థలు, ఎన్‌సీడీ క్లినిక్‌లు, ఇతర ఆరోగ్య కేంద్రాలలో 2,000కి పైగా పొగాకు అలవాటును మార్పించే కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చేశారు. విద్యాసంస్థలు, కళాశాల ప్రాంగణంలో పొగాకు రహిత పద్ధతులను అవలంబించేలా, వాటిని నిరంతరం కొనసాగించేలా ప్రోత్సహించడం చాలా ముఖ్యమని తెలిపారు. ఈ పైలట్ దశలో యాప్‌ను చురుగ్గా ఉపయోగించి ఈ కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేయడానికి తమ సలహాలు, సూచనలను అందించాలని భాగస్వామ్య సంస్థలను, అధికారులను ఆమె కోరారు.

పొగాకు వాడకం వల్ల క్యాన్సర్లు, గుండె జబ్బులు, పక్షవాతం, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు, అనేక ఇతర అంటువ్యాధులు కాని రోగాలు వస్తున్నాయని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి పేర్కొన్నారు. దేశంలో సంభవించే మరణాలకు, వైకల్యాలకు ఈ వ్యాధులే ప్రధాన కారణమని ఆమె చెప్పారు.

దేశవ్యాప్తంగా పొగాకు నియంత్రణ కార్యక్రమాలను బలోపేతం చేయడంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, విద్యాసంస్థలు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు, అమలు అధికారులు, స్వచ్ఛంద సంస్థలు , పౌర సమాజ సంస్థలు, సామాజిక కార్యకర్తలు చేస్తున్న నిరంతరం చేస్తున్న ప్రయత్నాలను ఆమె అభినందించారు. రాబోయే తరాలను పొగాకు, నికోటిన్ వ్యసనం నుంచి రక్షించడంలో భాగస్వాము లందరూ ఎల్లప్పుడూ అప్రమత్తంగా, ఐక్యంగా ఉండాలని ఆమె పిలుపునిచ్చారు.

ఆధారాలతో కూడిన పొగాకు నియంత్రణ విధానాలను ముందుకు తీసుకెళ్లడంలో, కొత్తగా వస్తున్న నికోటిన్, పొగాకు ఉత్పత్తుల నుంచి యువతను రక్షించడంలో భారత్ నిరంతర నాయకత్వ పాత్రను సంయుక్త కార్యదర్శి శ్రీ ప్రభాకర్ ప్రముఖంగా ప్రస్తావించారు.

పిల్లలను, టీనేజర్లను, యువతను పొగాకు, నికోటిన్ వ్యసనం బారిన పడకుండా రక్షించడం కోసం భారత్ పూర్తి నిబద్ధతతో పనిచేస్తున్నట్లు డెప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎల్ స్వస్తిచరణ్ తెలిపారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిన "ఆకర్షణల ముసుగు తొలగిద్దాం-నికోటిన్, పొగాకు వ్యసనాన్ని అడ్డుకుందాం" ప్రధానాంశానికి అనుగుణంగా ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం 2026ను నిర్వహించారు. అనేదానికి అనుగుణంగా ఉంది. ఆకర్షణీయమైన రుచులు, రంగురంగుల ప్యాకేజింగ్, డిజిటల్ మార్కెటింగ్, తప్పుదోవ పట్టించే ప్రచారాల ద్వారా యువతను ఆకర్షించడానికి పొగాకు, నికోటిన్ సంస్థలు రోజురోజుకూ మారుస్తున్న కొత్త ఎత్తగడలపై ఈ ప్రచారం అందరి దృష్టిని ఆకర్షిస్తుంది.

ఈ కార్యక్రమంలో భాగంగా పొగాకు రహిత, ఆరోగ్యకరమైన భారత్‌ను నిర్మించడం కోసం అందరితో "పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ" చేయించారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా ఈ పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ చేసే సదుపాయాన్ని కూడా కేంద్ర వైద్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కల్పించింది. ఈ ప్రతిజ్ఞను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ఇందులో అందరూ పెద్ద ఎత్తున పాల్గొనేలా ప్రోత్సహించాలని భాగస్వామ్య మంత్రిత్వ శాఖలను, రాష్ట్రాలను, కేంద్రపాలిత ప్రాంతాలను, అధికారులను మంత్రిత్వ శాఖ కోరింది.

యువతను భాగస్వామ్యం చేయడానికి, వారిలో అవగాహన పెంచే కార్యక్రమాలలో భాగంగా పొగాకు వాడకం, నికోటిన్ వ్యసనం వల్ల కలిగే హానికరమైన ప్రభావాలను వివరిస్తూ న్యూఢిల్లీకి చెందిన హృదయ్ సంస్థ సహకారంతో పాఠశాల విద్యార్థులు ఒక వీధి నాటకాన్ని ప్రదర్శించారు.

# క్లెయిము చేయని నగదు.. కామన్ ల్యాండింగ్ పోర్టల్‌ను ప్రారంభించిన ఆర్థిక సేవల విభాగం

న్యూఢిల్లీ, మే 30:క్లెయిమ్ చేయని ఆర్థిక ఆస్తుల కోసం కామన్ ల్యాండింగ్ పోర్టల్‌ను ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) ఈ రోజు ప్రారంభించింది. పీఎస్బీ అలయన్స్ సహకారంతో అభివృద్ధి చేసిన ఈ పోర్టల్ క్లెయిమ్ చేయని నగదుకు సంబంధించిన సమాచారాన్ని సులభంగా పొందేందుకు ఉపయోగపడుతుంది.

ఈ పోర్టల్‌ను 2026 మే 29న జరిగిన ప్రభుత్వ రంగ బ్యాంకుల సమీక్షా సమావేశంలో ఆర్థిక సేవల విభాగ కార్యదర్శి శ్రీ ఎమ్. నాగరాజు ప్రారంభించారు.

ఆర్థిక రంగ నియంత్రణ సంస్థలు, బ్యాంకులు, ఇతర భాగస్వామ్య సంస్థల సమన్వయంతో ఆర్థిక సేవల విభాగం చేపట్టిన దేశవ్యాప్త ప్రచారం "ఆప్కీ పూంజీ, ఆప్కా అధికార్ (మీ డబ్బు, మీ హక్కు)" ప్రచార కార్యక్రమానికి ఈ వేదిక మరింత బలం చేకూరుస్తోంది. క్లెయిమ్ చేయని నగదుపై అవగాహన కల్పించడం, వాటిని గుర్తించడం, యజమానులకు తిరిగి అందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలు.

క్లెయిమ్ చేయని నగదు కోసం ఒకే వేదికపై వెతుక్కునే సౌలభ్యం కల్పించడం ద్వారా ఈ పోర్టల్ పౌరుల సౌకర్యాన్ని మెరుగుపరుస్తుందని, వ్యక్తులను వారి అర్హత కలిగిన ఆర్థిక ఆస్తులతో తిరిగి అనుసంధానించడానికి ప్రస్తుతం జరుగుతున్న ప్రయత్నాలను బలోపేతం చేస్తుందని ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి ప్రముఖంగా పేర్కొన్నారు. ఈ సమగ్ర వేదిక (కామన్ ల్యాండింగ్ పోర్టల్) మరింత సులభమైన, పారదర్శకమైన, ప్రజా కేంద్రీకృత ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేసే దిశగా ఒక ముఖ్యమైన అడుగు. మెరుగైన ఆర్థిక సాధికారత, సమ్మిళితం, ఆర్థిక వ్యవస్థపై నమ్మకం ద్వారా వికసిత్ భారత్ 2047 దార్శనికతకు అనుగుణంగా ఈ కార్యక్రమం ప్రజలలో అవగాహనను పెంచుతుందని, సమాచారాన్ని సులభంగా పొందే వీలు కల్పిస్తుందని భావిస్తున్నారు.

# మత్తుపై యుద్ధం.. జిల్లాకు కొత్త లక్ష్యం




అమరావతి, మే 30:మాదకద్రవ్యాల మత్తుతో యువత విలువైన జీవితాన్ని నాశనం చేసుకోకూడదని, జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎన్‌వీ రాజశేఖరబాబు పిలుపునిచ్చారు.

మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ఏర్పాటు చేసిన నషా ముక్త్ భారత్ అభియాన్, నార్కో కోఆర్డినేషన్ సెంటర్ జిల్లా స్థాయి సమన్వయ సమావేశం శనివారం కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు.

సమావేశంలో డ్రగ్స్‌పై దండయాత్ర, జిల్లాలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు, ఈగల్ ఆపరేషన్స్, డీ-అడిక్షన్ కేంద్రాల సేవలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం, ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్, హాట్‌స్పాట్ల తనిఖీలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వినియోగించే వ్యక్తితో పాటు వారి కుటుంబంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతాయని అన్నారు. డ్రగ్స్ వినియోగం వల్ల శారీరక, మానసిక, సామాజిక జీవితం దెబ్బతింటుందని పేర్కొన్నారు.

గుండె, కాలేయం, ఊపిరితిత్తుల సమస్యలతో పాటు రోగనిరోధక శక్తి తగ్గి ప్రాణాపాయ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉంటుందని తెలిపారు. మానసిక ఆందోళన, జ్ఞాపకశక్తి క్షీణత, ఏకాగ్రత లోపం వంటి సమస్యలతో పాటు కుటుంబ, ఆర్థిక, చట్టపరమైన ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు.

జిల్లాలో గుర్తించిన సుమారు 150 హాట్‌స్పాట్లలో ప్రత్యేక నిఘా కొనసాగించాలని సూచించారు. కీలక ప్రాంతాల్లో రాత్రి వేళల్లో నైట్ విజన్ డ్రోన్లతో పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

మాదకద్రవ్యాల నిర్మూలనలో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం అభినందనీయమని పేర్కొన్నారు. 1972 టోల్‌ఫ్రీ నంబర్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

పోలీస్ కమిషనర్ ఎన్‌వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థతో పాటు సమాజాన్ని దెబ్బతీసే మాదకద్రవ్యాలను సమూలంగా నిర్మూలించాలనే లక్ష్యంతో పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారని తెలిపారు.

మాదకద్రవ్యాల సరఫరా, వినియోగంలో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. యువతలో అవగాహన పెంచేందుకు వినూత్న కార్యక్రమాలను ఉద్యమంలా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

హాట్‌స్పాట్ ప్రాంతాలతో పాటు రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు తదితర ప్రాంతాల్లో నిఘా పెంచడంతో మంచి ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు.

ఈ సందర్భంగా ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నివారణపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన వాల్ పోస్టర్లను కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎన్‌వీ రాజశేఖరబాబు ఆవిష్కరించారు.

కార్యక్రమంలో డీసీపీ కేజీవీ సరిత, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, టీజీ, వయోవృద్ధుల సంక్షేమ అధికారి ఎం. ఫణి దూర్జటి, డీఈవో చంద్రకళ, ఈగల్ అధికారులు ఎం. రవీంద్ర, సంక్షేమ శాఖ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డా. కొల్లేటి రమేష్, హెల్త్ కేర్ అండ్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు ఎం. అనిల్ కుమార్, ఆకర్ష ఫౌండేషన్ సైకాలజిస్ట్ డా. శంకర్‌రావు, నవజీవన్ బాల్ భవన్ ప్రతినిధి శేఖర్‌బాబు, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ కో-ఆర్డినేటర్ ఆరవ రమేష్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వడదెబ్బతో ఒకరు మృతి..

అమరావతి, మే 30:వడదెబ్బతో ఒకరు మృతి చెందిన సంఘటన దండేపల్లి మండలంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం జైతూగుడా గ్రామానికి చెందిన ఆత్రం రాజేష్ (50)మృతి చెందాడు మృతుడు రాజేష్ రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం కూలీపనులకు వెళ్లాడు. పనులు చేస్తుండగా అక్కడే కళ్లుతిరిగి కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో ఇంటికి తీసుకెళ్లారు. వడదెబ్బ తగలడంతోనే వాంతులు, విరేచనాలు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం లక్షెటిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, రాజేష్ అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించడంతో. మృతునికి భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తహసినోద్దీన్ తెలిపారు.

# ఎన్నికలకు ముందేమో డిక్లరేషన్ల వరద.. ఇప్పుడు నోరు తెరిస్తే బురద : కేటీఆర్

హైదరాబాద్, మే 30: ఇందిరా పార్క్ వద్ద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ధర్నా కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రేవంత్ రెడ్డి కాంట్రాక్టర్లను చేస్తా అన్నడు రేవంత్ రెడ్డి. చేవెళ్లలో ఎస్సీ,ఎస్టీ డిక్లరేషన్‌లో 18 శాతం ఎస్సీలకు, 12 శాతం ఎస్టీలకు.. మొత్తం 30 శాతం ప్రభుత్వం కాంట్రాక్టుల్లో మీకే ఇస్తా అని చెప్పి గద్దెనెక్కిండు. కామారెడ్డిలో ప్రభుత్వ కాంట్రా క్టులలో బీసీలకు 42 శాతం వాటా అని చెప్పిండు. అంటే మొత్తం 72 శాతం వాటా.. ఈ రెండున్నరేళ్లలో రూపాయి టెండరు పిలిస్తే 72 పైసలు మొత్తం ఎస్సీ, ఎస్టీ, బీసీలకే రావాలి. రేవంత్ రెడ్డి వచ్చాక 4 లక్షల కోట్లు అప్పు చేసిండు.. 4 లక్షల కోట్ల అప్పులో మొత్తం నాలుగు రూపాలన్నా బీసీ,ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్టర్లకు ఇచ్చినవా.. చెప్పే దమ్ముందా.. శ్వేత పత్రం ఇచ్చి దమ్ముందా.. అని ప్రశ్నించారు.తెల్లారి లేస్తే నోటికొచ్చిన సొల్లు వాగుడు.. నోటికొచ్చిన పనికిమాలిన మాటలు.. ఎన్నికలకు ముందేమో డిక్లరేషన్ల వరద.. ఇప్పుడు నోరు తెరిస్తే బురద.. అది తప్ప ఏం లేదు..బూతులు, బురద తప్ప ఒక్కటంటే ఒక్క పని చేసిండా.. ఆలోచన చేయండన్నారు కేటీఆర్. కేసీఆర్ ఏమో అధికారులకు మీరు రొటీన్ ఫైళ్లు నా దగ్గరకు తీసుకురాకండి..చిన్న స్థాయిలో ఉండే చిన్న కాంట్రాక్టర్లను ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను కాపాడండి.. పైకి తీసుకురండి అని ఆయన అప్పజెప్తే నువ్వు పెద్ద పెద్ద మాటలు చెప్పి వచ్చి ఎవరికి ఇస్తున్నవ్ ఇయ్యాళ్ల కాంట్రాక్టులు అని కేటీఆర్ ప్రశ్నించారు.

# వరి కొయ్యలను కాల్చి పర్యావరణాన్ని పాడు చేయొద్దు

## -జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట, మే 30: రైతులు వరి పంట కోసిన తర్వాత పొలంపై ఉన్న వరి కొయ్యలను కాల్చడం వల్ల అనేక దుష్పరిణామాలు సంభవిస్తాయని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ రైతులకు సూచించారు. శనివారం సూర్యాపేట మండలం కాసారాబాద్ గ్రామంలో వరి కొయ్యలను తగలబెట్టొద్దని రైతులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె.నరసింహతో కలిసి పాల్గొని మాట్లాడారు. వరికోయ్యలు తగలబెడితే భూమి సారవంతం కోల్పోతుందని, అనంతరం దుక్కి దున్నినప్పటికీ గుల్లగా మారదని, దీనివల్ల పంట దిగుబడి తగ్గుతుందన్నారు.

సాంద్రత పెంచుకునేందుకు అధిక ఎరువులు వాడాల్సి వస్తుందని ఆ భారం కూడా రైతులపైన పడుతుందని వివరించారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యంతో పాటు, రహదారులపై వెళ్లే వాహనదారులకు కూడా ఇబ్బందులు ఏర్పడతాయని, వరి కొయ్యల వల్ల పక్కన ఉన్న చెట్లు, ఇతర విలువైన వస్తువులు పరికరాలు తగలబడే అవకాశం ఉందని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని రైతులు ఎట్టి పరిస్థితులలో వరి కోయ్యలను తగలబెట్ట వద్దన్నారు. రైతులు వరికొయ్యలను తగలబెట్టకుండా ఉండేందుకుగాను వ్యవసాయ శాఖ ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

జిల్లా ఎస్పీ కె.నరసింహ మాట్లాడుతూ వరి కొయ్యలను పొలం పైన తగలబెట్టడం వల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతినడమే కాకుండా, భూములు సారవంతం కోల్పోతుందన్నారు. ఎవరైనా ఇలా వరి కొయ్యలు తగలబెట్టడం వల్ల ప్రమాదాల సంభవిస్తే అందుకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, ఎసిపి ప్రసన్న కుమార్, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపిడిఓ బాలకృష్ణ, ఎడిఎ జ్ఞానేశ్వరి, ఎఓ కృష్ణ సందీప్, సర్పంచ్ కోతి గోపాల్ రెడ్డి ఇతర అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌వో టు జీఎం జి.వి.కోటిరెడ్డి పదవీ విరమణ.. ఎస్ అండ్ పీసీ ఆధ్వర్యంలో ఘన సన్మానం

రుద్రంపూర్, మే 30 : జి.వి.కోటిరెడ్డి తన ఉద్యోగ జీవితంలో అంకితభావం, క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వహించి అందరికీ ఆదర్శంగా నిలిచారని, సంస్థ అభివృద్ధికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమైనవని కొత్తగూడెం ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ అభిలాష్ అన్నారు. శనివారం కొత్తగూడెం ఏరియాలో ఎస్‌వో టు జీఎంగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన జి.వి.కోటిరెడ్డిని ఎస్ అండ్ పీసీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమే, కానీ ఆయన సంపాదించిన గౌరవం, అనుభవం, సత్సంబంధాలకు ముగింపు కాదన్నారు.

భవిష్యత్‌లో ఆరోగ్యం, ఆనందం, కుటుంబ సభ్యుల ప్రేమాభిమానాలతో సుఖసంతోషాలతో కూడిన జీవితం గడపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఆయన సేవలు తమకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్ రెడ్డి, జె.రాంబాబు, జూనియర్ ఇన్‌స్పెక్టర్ కామరాజ్, షిఫ్ట్ జమేదార్ కమల్ సింగ్, సీనియర్ సెక్యూరిటీ గార్డులు హానోక్ రాజు, త్రిపాఠి, మల్లికార్జున్, సురేశ్, పి.విజయ్‌తో పాటు ప్రైవేట్ సెక్యూరిటీ సూపర్‌వైజర్లు నూకరాజు, దినేష్ యాదవ్, కామేశ్, మురళి, చంటి పాల్గొన్నారు.

# గుజరాత్‌లోని భుజ్ పరిధిలో భారత్-పాక్ సరిహద్దు వెంబడి జి-7.. జి-13 సైనిక శిబిరాలకు కేంద్ర హోం-సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా ప్రారంభోత్సవం

న్యూఢిల్లీ, మే 30: కేంద్ర హోం-సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా ఈ రోజు గుజరాత్‌లోని భుజ్‌లో రెండు సరిహద్దు సైనిక దళ (బీఎస్ఎఫ్) శిబిరాలను ప్రారంభించారు. అనంతరం జి-7 శిబిరం వద్ద బీఎస్ఎఫ్ సిబ్బందితో కొంతసేపు ముచ్చటించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ భూపేంద్ర పటేల్, ఉప ముఖ్యమంత్రి శ్రీ హర్ష్ సంఘవి సహా కేంద్ర హోంశాఖ కార్యదర్శి, నిఘా సంస్థ (ఐబీ) (ఎః) డైరెక్టర్, సరిహద్దు నిర్వహణ కార్యదర్శి, బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్, ఇతర సీనియర్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శ్రీ అమిత్ షా ప్రసంగిస్తూ- "బీఎస్ఎఫ్ సిబ్బంది అత్యంత కఠిన వాతావరణం, సంక్లిష్ట భౌగోళిక పరిస్థితుల నడుమ కర్తవ్య నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తుంటారు. ఈ ప్రదేశాన్ని సందర్శించి, దేశ సరిహద్దుల రక్షణలో వారు చిరునవ్వుతో బాధ్యతలు నిర్వర్తించడం చూస్తే, మనమెంత హాయిగా జీవిస్తున్నామో అర్థమవుతుంది. దేశమాతను రక్షించడంలో అలుపెరగని వారి కర్తవ్య నిర్వహణతో పోల్చినపుడు మేమెంతో అలసిపోతున్నామని చెప్పే హక్కు మనకుండదు" అని స్పష్టం చేశారు.

బీఎస్ఎఫ్ ఆవిర్భవించి 60 ఏళ్లు పూర్తికాగా, దేశంలోనే అత్యంత సవాళ్లలో కూడిన రెండు సరిహద్దుల రక్షణ బాధ్యతను ఆ దళం తన భుజాలకెత్తుకున్నదని శ్రీ అమిత్ షా గుర్తుచేశారు. ఈ సరిహద్దులలో మోహరించిన సిబ్బంది మైనస్ 45 డిగ్రీల నుంచి ప్లస్ 45 డిగ్రీల మధ్య శీతోష్ణ పరిస్థితులను తట్టుకుంటూ అనూహ్య ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన గుర్తుచేశారు. ఇలాంటి కొన్ని ప్రాంతాల్లో- కచ్‌లోని కఠిన ఎడారి, సర్ క్రీక్ సముద్ర ప్రాంతం, హరామీ నాలా వంటి చిత్తడి నేలలు ఉంటాయి. రాజస్థాన్ వంటి మరికొన్ని చోట్ల ఇసుక దిబ్బల మధ్య తీవ్ర ఉష్ణోగ్రతను భరిస్తూ బీఎస్ఎఫ్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తుంటారు. అదేవిధంగా కాశ్మీర్‌లోని మంచు శిఖరాల నుంచి సుందర్బన్స్ అడవులదాకా... గంగాసాగర్ తీరాల వరకూ.. మేఘాలయ-అస్సాం కొండలు, అటవీ ప్రాంతాల వరకూ విస్తరించిన ప్రాంతాన్ని బీఎస్ఎఫ్ జవాన్లు అప్రమత్తతతో రక్షిస్తుంటారు. ఈ మేరకు ఆరు దశాబ్దాలుగా "తొలి రక్షణ కుడ్యం"గా వారు అద్భుత రీతిలో కర్తవ్యం నిర్వర్తిస్తున్నారని కొనియాడారు. ఇప్పటిదాకా ఈ దళాల్లోని 2 వేల మంది సిబ్బంది దేశం కోసం ప్రాణార్పణం చేశారని గుర్తుచేశారు. అందుకే, కేంద్ర ప్రభుత్వంతోపాటు దేశంలోని 140 కోట్ల మంది పౌరులు ఈ దళాలపై అత్యంత గౌరవం ప్రదర్శిస్తారని చెప్పారు. వారు ధైర్యసాహసాలతో సరిహద్దులను రక్షిస్తున్నారు కాబట్టే, తామంతా గుండెలమీద చేయి వేసుకుని ప్రశాంతంగా నిద్రించగలుగుతున్నామని కృతజ్ఞతలు చెబుతున్నారని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు.

బీఎస్ఎఫ్ సిబ్బంది అంకితభావాన్ని, శౌర్యపరాక్రమాలను సామాన్యులందరికీ విశదం చేయడం కోసం గుజరాత్‌లోని బనస్కాంతలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని శ్రీ అమిత్ షా తెలిపారు. ఈ కేంద్రాన్ని గత ఒక్క నెలలోనే 2.50 లక్షల మందికి పైగా ప్రజలు తిలకించి బీఎస్ఎఫ్ త్యాగనిరతి ఎంతటిదో అవగతం చేసుకున్నారని గుర్తుచేశారు. తొలినాళ్లలో ఈ దళం పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం 'ఫీడ్‌బ్యాక్ ఫామ్" ద్వారా ఒక అధ్యయనం నిర్వహించామని ఆయన ప్రస్తావించారు. ఆ సందర్భంగా తమ బిడ్డలు పెరిగి, పెద్దయ్యాక 'బీఎస్ఎఫ్'లో చేరితే తామెంతో గర్విస్తామని ఎందరో మహిళలు రాశారని తెలిపారు. దేశం కోసం అటువంటి కఠిన పరిస్థితుల నడుమ విధులు నిర్వర్తించడం నిజంగా ఎనలేని త్యాగానికి, సాహసోపేత జీవనానికి నిదర్శనమన్నారు. ఇప్పుడు కూడా దేశ పౌరులు ఈ 'ఫీడ్‌బ్యాక్ ఫామ్'ను ఆన్‌లైన్‌లో నింపవచ్చునని తెలిపారు.

కేంద్ర హోం మంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ఓ సందర్భంలో తాను బీఎస్ఎఫ్ పనితీరును సమీక్షించానని ఆయన గుర్తుచేసుకున్నారు. ఆ సందర్భంగా 'హరామీ నాలా', 'సర్ క్రీక్' ప్రాంతాల్లో భద్రత సంసిద్ధత కొంత బలహీనంగా ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. అందుకే, అన్నివిధాలా 'అభేద్య' భద్రత వలయం ఏర్పాటు దిశగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా నిఘా బురుజులు, అనుసంధాన రహదారులు, తాగునీటి సరఫరా, వైద్య సదుపాయాలు, వసతి కల్పన సహా కొత్త కంచె నిర్మాణం ప్రారంభించామని తెలిపారు. రాబోయే రెండేళ్లలో, శత్రు దృష్టి నుంచి మన ప్రాంతం సదా సురక్షితంగా మారుతుందని ఆయన వివరించారు.

ఇక 'సర్ క్రీక్', భుజ్ సెక్టార్లలో సరిహద్దు భద్రత సిబ్బంది దృఢమైన రక్షణ కుడ్యంలా నిలిచి ప్రజలకు సంపూర్ణ భద్రతనిస్తున్నారని కేంద్ర హోం మంత్రి తెలిపారు. సైనికులకు ఎదురయ్యే ఇబ్బందులను కనీస స్థాయికి పరిమిత చేసేవిధంగా అన్ని సదుపాయాలనూ కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ దిశగా శ్రీ మోదీ ప్రభుత్వం రేయింబవళ్లు కృషి చేస్తోందని, ఇందుకు బడ్జెట్ వరంగా పరిమితులేవీ అడ్డురావని తెలిపారు. మరోవైపు సాంకేతికత సద్వినియోగంలో శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని చెప్పారు. అందువల్ల ఈ ప్రాంతంలో క్రమంగా పటిష్ఠ భద్రత వలయం ఏర్పాటు చేయడంలో విజయం సాధించామని తెలిపారు. ఇందులో భాగంగా ఇక్కడ నిఘా బురుజుల నిర్మాణం సహా సరిహద్దు సైనిక శిబిరాలుండే ప్రాంతాన్ని నేల మట్టంకన్నా ఎత్తుగా ఉండేవిధంగా తీర్చిదిద్దామన్నారు.

'బీఎస్ఎఫ్' ఆవిర్భవించి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సరిహద్దు భద్రతలో బీఎస్ఎఫ్ భావనను సమూల రీతిలో మార్చాలని నిర్ణయించినట్లు శ్రీ అమిత్ షా తెలిపారు. ఈ మేరకు భవిష్యత్తులో సరిహద్దు భద్రత అనే సంప్రదాయ విధానానికి బదులు, చతుర్భుజ భద్రత వలయం ఏర్పాటు చేసి, 'ప్రాదేశిక భద్రత' పేరిట కొత్త భావనను పరిచయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ సిబ్బందితో పాటు ప్రజలు, పౌర పరిపాలన యంత్రాంగాలు, స్థానిక పోలీసులు, సైన్యం కూడా ప్రాథమికంగా బాధ్యతలు పంచుకోవాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. 'స్మార్ట్ బోర్డర్ సెక్యూరిటీ ప్రాజెక్ట్' కింద, సరిహద్దుల వెంబడి భద్రత వలయం పటిష్టానికి కృషి కొనసాగుతున్నదని పేర్కొన్నారు. ఇందుకు వేల కోట్ల రూపాయల పెట్టుబడి అవసరమని చెప్పారు. ఈ మేరకు డ్రోన్లు, రాడార్లు, వాచ్‌టవర్లు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, భద్రత సిబ్బంది మోహరింపు తదితరాల ద్వారా పటిష్ఠ భద్రత వలయం ఏర్పాటు కాగలదని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ వలయం ఏర్పాటు పూర్తయితే మన సరిహద్దుల వైపు కన్నెత్తి చూడాలన్నా ఎవరూ సాహసించరని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

సరిహద్దు భద్రత దళానికి అదనపు బాధ్యతలు అప్పగించే అంశాన్ని పరిశీలిస్తున్నామని కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా తెలిపారు. పశ్చిమ బెంగాల్ సరిహద్దు వెంబడి కంచె నిర్మాణం అసంపూర్ణంగా ఉండటమే మన భద్రత వ్యవస్థలో అత్యంత కీలక లోపమని ఆయన పేర్కొన్నారు. భౌగోళిక పరిస్థితులను మార్చలేకపోయినా, కంచె నిర్మాణ అనుకూల ప్రాంతాల్లోనూ లోగడ భూసేకరణకు ఇబ్బందులు ఎదురయ్యాయని ఆయన తెలిపారు. అయితే, ఇటీవల ప్రజల ఆశీస్సులతో తమ పార్టీ ఆ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేపథ్యంలో బాధ్యతలు స్వీకరించిన ఒక్క వారంలోనే, సరిహద్దు కంచె కోసం భూమి కేటాయించేందుకు ముఖ్యమంత్రి సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఇప్పటికే కొంత భూమిని అప్పగించారని, సరిహద్దు కంచె నిర్మాణం పూర్తయ్యాక చొరబాట్లను వంద శాతం అరికట్టగలమని ఆయన ఆత్మవిశ్వాసం వెలిబుచ్చారు. దీంతోపాటు అడవులు, నదీ మార్గాల గుండా చొరబాట్ల నిరోధం కోసం ఆయా ప్రాంతాల్లో సాంకేతిక పరిజ్ఞాన సహిత కంచె ఏర్పాటును వేగిరపరుస్తున్నామని చెప్పారు. బీఎస్ఎఫ్ సిబ్బంది శౌర్యపరాక్రమాలు, ధైర్యసాహసలు, విధి నిర్వహణపై వారి అంకితభావం వంటివి భవిష్యత్తుల్లోనూ మన సరిహద్దులను సురక్షితంగా ఉంచుతాయని ఆయన ప్రకటించారు.

సరిహద్దు భద్రత దళం స్ఫూర్తిని యావద్దేశం గౌరవిస్తున్నదని, వారి నిబద్ధతకు శిరసాభివందనం చేస్తున్నదని కేంద్ర హోం-సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. గుజరాత్ పరిధిలోని సరిహద్దు ప్రాంతాల్లో సుస్థిర శాంతికి వారి అప్రమత్తతే కారణమని ఆయన స్పష్టం చేశారు.

# అర్హులైన రైతులకు త్వరలో పాస్ పుస్తకాలు : జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం, మే 30:ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలోని సత్యనారాయణపురం గ్రామంలో శనివారం జాయింట్ కలెక్టర్ వి.శ్రీనివాసరెడ్డి రైతులతో సమావేశమయ్యారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ సమావేశంలో జమలాపురం రెవెన్యూ సర్వే నంబర్ 58 పరిధిలో సాగు చేస్తున్నప్పటికీ పాస్ పుస్తకాలు అందని రైతుల సమస్యలను ఆయన స్వయంగా పరిశీలించారు. రైతుల వద్ద ఉన్న పాత పాస్ పుస్తకాలు, ఇతర ఆధార పత్రాలతో పాటు రెవెన్యూ శాఖ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన జాయింట్ కలెక్టర్, అర్హులైన రైతుల వివరాలను సేకరించి నివేదిక పంపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత పాస్ పుస్తకాలు ఉన్నప్పటికీ ఇప్పటి వరకు కొత్త పాస్ పుస్తకాలు అందని అర్హులైన రైతులను గుర్తించి వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

# ఇల్లెందు మున్సిపల్ కార్యాలయం ముందు టీయూసీఐ ధర్నా



ఖమ్మం, మే 30: ఇల్లెందు మున్సిపాలిటీలో పనిచేస్తూ చనిపోయిన కార్మికుల కుటుంబంలో నుండి ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేస్తూ టీయూసీఐ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. శనివారం ఇల్లెందు మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపాలిటీ సాధారణ సమావేశం నిర్వహించారు.

తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్, టీయూసీఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు మృతుల కుటుంబాలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ కార్మికులుగా అనేక సంవత్సరాలుగా పని చేస్తున్న నలుగురు కార్మికులు అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు.

దీంతో మున్సిపల్ చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్ర, కమిషనర్ శ్రీకాంత్.. మృతుల కుటుంబాలు, యూనియన్ జిల్లా కార్యదర్శి యాకుబ్ షావలిని, కౌన్సిల్ సమావేశం చాంబర్‌కు పిలిపించి చర్చలు జరిపారు.

ఇటీవల చనిపోయిన కార్మికుల కుటుంబాల నుండి ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరగా చైర్మన్, కమిషనర్ నాలుగు రోజులు టైం ఇవ్వాలని వాళ్లకు ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో కొమరయ్య, దేవులపల్లి మోహన్ రావు, అక్కపాక శ్రీధర్, జాడి శివకుమార్ పాల్గొన్నారు.

# సైకిల్‌పై రంగంలోకి దిగిన ఎమ్మెల్యే..

## -వెంటనే మారిన నిర్ణయం!

అమరావతి, మే 30:తిరువూరు నియోజకవర్గ పరిధిలో పారిశుద్ధ్య మెరుగుదలే లక్ష్యంగా చేపట్టిన "ఆపరేషన్ క్లీన్ స్వీప్'' కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు శనివారం ముమ్మరంగా నిర్వహించారు. పట్టణంలోని



వడ్డెర బజారు, మాలపల్లి, బస్టాండ్ ఔట్‌గేట్, మార్కెట్ ప్రాంతాల్లో ఆయన స్వయంగా పర్యటించి పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు.

ఈ సందర్భంగా స్థానిక డ్రైనేజీ వ్యవస్థలు, పారిశుద్ధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

**సైకిల్‌పై పర్యటించి సమస్యల అధ్యయనం**

ప్రజలకు మరింత చేరువయ్యే ఉద్దేశంతో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పట్టణ వీధుల్లో సైకిల్‌పై పర్యటించారు. స్థానికుల సమస్యలను నేరుగా తెలుసుకుంటూ పలు ప్రాంతాల్లో పరిశీలన నిర్వహించారు.

అనంతరం సర్దార్ బాపయ్య కూరగాయల మార్కెట్ పాత భవనాన్ని సందర్శించారు. పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న భవన పరిస్థితిని పరిశీలించిన ఆయన, ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున వెంటనే భవనాన్ని కూల్చివేయాలని అధికారులను ఆదేశించారు.

**ఆధునిక మార్కెట్ నిర్మాణానికి హామీ**

ప్రస్తుతం ఉన్న పాత భవనం స్థానంలో అన్ని సౌకర్యాలతో కూడిన ఆధునిక కూరగాయల మార్కెట్ నిర్మిస్తామని ఎమ్మెల్యే వ్యాపారులకు హామీ ఇచ్చారు. వ్యాపారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెరుగైన వసతులతో మార్కెట్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు.

**ప్రత్యామ్నాయ స్థలం కోరిన వ్యాపారులు**

కొత్త మార్కెట్ నిర్మాణం పూర్తయ్యే వరకు వ్యాపారాలు నిర్వహించేందుకు అనువైన ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించాలని స్థానిక కూరగాయల వ్యాపారులు ఎమ్మెల్యేను కోరారు. బస్టాండ్ ఆవరణలో ఖాళీ స్థలం అందుబాటులో ఉందని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, వ్యాపారులతో కలిసి బస్టాండ్ వద్ద ఉన్న స్థలాన్ని పరిశీలించి, తాత్కాలికంగా అక్కడే వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో మున్సిపల్ అధికారులు, పోలీసు సిబ్బంది, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే స్వయంగా ప్రాంతాలను సందర్శించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టడంపై స్థానిక ప్రజలు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు.

# నేవీ వైస్ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన వైస్ అడ్మిరల్ అజయ్ కొచ్చార్

న్యూ ఢిల్లీ, మే 30:ఆపరేషన్ సింధూర్ వ్యూహకర్త వైస్ అడ్మిరల్ అజయ్ కొచ్చార్. శుక్రవారం నాడు నేవీ వైస్ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం మిలిటరీలోని టాప్ నేతల మార్పులు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా అజయ్ కొచ్చార్ పదోన్నతి పొందారు. త్రివిధ దళాలు కొత్త చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాజా సుబ్రమణి, తదుపరి నేవీ చీఫ్ వైస్ అడ్మిరల్ కే స్వామినాథన్.. ఆదివారం రోజున తమ కొత్త బాధ్యలు స్వీకరించనున్నారు. ఇక శుక్రవారం రోజున ముంబైలోని వెస్ట్రన్ నావెల్ కమాండ్‌కు కమాండర్‌గా వైస్ అడ్మిరల్ సంజయ్ వాత్సాయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, నేవీ చీఫ్ అడ్మిరల్ డీకే త్రిపాఠి.. శని, ఆదివారాల్లో పదవీవిరమణ చేయనున్నారు. ఆర్మీ జనరల్ ఉపేంద్ర ద్వివేది.. జూన్ 30వ తేదీన ఆర్మీ చీఫ్‌గా రిటైర్ కానున్నారు.

వైస్ అడ్మిరల్ కొచ్చార్‌ది.. హర్యానాలోని కర్నాల్. ఆయన తండ్రి హర్యానా ఇరిగేషన్ శాఖలో మాజీ ఇంజినీర్. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన తర్వాత జాతీయ వార్ మెమోరియల్ వద్ద కొచ్చార్ పుష్పగుచ్ఛం ఉంచారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో నేవీకి చెందిన ప్లానింగ్‌ను అడ్మిరల్ కొచ్చార్ చేశారు. ముంబై నుంచి ఆయన ఆ ఆపరేషన్ నిర్వహించారు.

# గువాహటిలో పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'సేవా సే సమృద్ధి' ప్రాంతీయ సదస్సు

న్యూఢిల్లీ, మే 30:నేడు గువాహటిలో 'సేవా సే సమృద్ధి: పంచాయతీల ఆధ్వర్యంలో సేవల పంపిణీ' ప్రాంతీయ సదస్సును కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ నిర్వహించింది. ఈ సదస్సును కామన్ సర్వీసెస్ సెంటర్ స్పెషల్ పర్పస్ వెహికల్ (సీఎస్సీ-ఎస్‌పీవీ), అస్సాం ప్రభుత్వ పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖల భాగస్వామ్యంతో ఏర్పాటు చేశారు. గ్రామీణ భారత్‌లో సేవలను మరింత మెరుగుపరచడం, ప్రజల జీవన ప్రమాణాలను సులభతరం చేయడం కోసం కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ చేపట్టిన నిరంతర ప్రయత్నాల్లో భాగంగా ఈ సదస్సు నిర్వహించారు. బాధ్యతాయుతమైన, చురుకైన పంచాయతీ రాజ్ సంస్థలను, గ్రామీణ స్థానిక సంస్థలను బలోపేతం చేయడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం. మొత్తం ఏడు రాష్ట్రాలు అస్సాం (ఆతిథ్య రాష్ట్రం), ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్ నుంచి పంచాయతీ కార్యకర్తలు, ఎన్నికైన ప్రతినిధులు, గ్రామ స్థాయి పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

ఈ సదస్సుకు కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ సహాయ మంత్రి ప్రొఫెసర్ ఎస్‌పీ సింగ్ బఘేల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలు, రైతులు, గ్రామీణ జీవనోపాధి ద్వారానే దేశ శ్రేయస్సు, అభివృద్ధి సాధ్యమవుతాయని చెప్పారు. ప్రతి ఒక్క వ్యక్తి నిజమైన సాధికారత మాత్రమే.. గ్రామాలను, రాష్ట్రాలను, చివరికి మన దేశాన్ని స్వయంసమృద్ధితో కూడిన అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి బలమైన పునాది అని స్పష్టం చేశారు.

దేశవ్యాప్తంగా ఉన్న పౌర సేవా కేంద్రాలు భారీ స్థాయిలో గ్రామీణ ఉపాధిని కల్పించడంతోపాటు పౌరులకు పెన్షన్లు, రకరకాల ధ్రువీకరణ పత్రాలు, బీమా పథకాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ఎలాంటి ఇబ్బంది లేకుండా నేరుగా అందిస్తున్నాయని కేంద్ర మంత్రి తెలియజేశారు. ఆధార్, బ్యాంకు ఖాతాలు, భూమి రికార్డుల్లో ఉండే వివరాలు ఎలాంటి తప్పులు లేకుండా కచ్చితంగా ఉండటం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. వీటిలో దొర్లే చిన్న చిన్న తప్పుల వల్ల కూడా అర్హులైన లబ్ధిదారులు పీఎం కిసాన్ వంటి ఉపయోగకరమైన పథకాల ప్రయోజనాలను పొందలేకపోతున్నారని అన్నారు.

పౌర సేవా కేంద్రాల నిర్వాహకులకు మరింత మెరుగైన శిక్షణ ఇవ్వాలని, వారి సామర్థ్యాలను పెంచాలని కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు. ఈ డిజిటల్ సేవా కేంద్రాలను గ్రామ పంచాయతీలతో సమర్థవంతంగా అనుసంధానించినప్పుడు అవి ప్రతి పౌరుడి ఇంటి వద్దకే ప్రజా సేవలను అందించే శక్తిమంతమైన, వేగవంతమైన కేంద్రాలుగా మారుతాయని స్పష్టం చేశారు. డిజిటల్ వేదికలు, స్థానిక పాలనా సంస్థల మధ్య సమన్వయాన్ని మరింత పటిష్టం చేయాలని అధికారులను కోరారు. దీనివల్ల అర్హత ఉన్న ప్రతి పౌరుడికి సరైన సమయానికి ప్రభుత్వ ఫలాలు అందుతాయని, తద్వారా 'సేవా సే సమృద్ధి' లక్ష్యం నెరవేరడంతోపాటు 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణానికి గొప్ప సహకారం అందించగలమని తెలిపారు.

మార్పు, అభివృద్ధి, కార్మిక సంక్షేమం, తేయాకు తోటల కార్మికులు, ఆదివాసీల సంక్షేమ శాఖల మంత్రి శ్రీ రామేశ్వర్ తేలి మాట్లాడుతూ.. పంచాయతీ రాజ్ సంస్థల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని చివరి వ్యక్తికి కూడా ప్రభుత్వ సేవలను చేర్చడంలో భారత ప్రభుత్వం, అస్సాం ప్రభుత్వం కలిసికట్టుగా చేస్తున్న కృషిని అభినందించారు. తేయాకు తోటల కార్మికులు, ఆదివాసీ ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ఈ వర్గాల ప్రజల జీవనోపాధిని మెరుగుపరచడం, సంక్షేమ పథకాలు, విద్య, ఆరోగ్యం, సామాజిక భద్రతను వారికి సులభంగా అందుబాటులోకి తీసుకురావడం కోసం నిరంతరం అనేక కార్యక్రమాలను చేపడుతున్నామని, దీనివల్ల అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి విభాగానికి చేరుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో బలమైన పంచాయతీ పాలన కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ... వివిధ ప్రభుత్వ శాఖల మధ్య నిరంతర సమన్వయం వల్ల అస్సాం అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో పాల్గొన్న వివిధ రాష్ట్రాలకు చెందిన అత్యుత్తమ గ్రామ పంచాయతీలను, గ్రామ స్థాయి పారిశ్రామికవేత్తలను ఈ సదస్సులో ఘనంగా సన్మానించారు. ముఖ్యంగా ఒడిశాలోని కేందుఝర్ జిల్లాలోని సువాకతి గ్రామ పంచాయతీని ప్రత్యేకంగా అభినందించారు. ఈ పంచాయతీ డిజిటల్ సేవల విప్లవంలో చేసిన కృషికి గాను జాతీయ డిజిటల్ పరిపాలన అవార్డులు 2025లో జ్యూరీ అవార్డును గెలుచుకుంది. వీరు ఒడిశావన్, సేవా ఒడిశా, వేదికల ద్వారా అవసరమైన అన్ని ప్రభుత్వ సేవలను డిజిటలైజ్ చేశారు. దీనివల్ల ప్రజలు 24 గంటలూ ఆన్‌లైన్ ద్వారా సేవలను పొందుతూ, తమ దరఖాస్తు ఏ దశలో ఉందో కూడా స్వయంగా చూసుకునే సదుపాయం లభించింది. క్షేత్రస్థాయిలో మహిళా నాయకత్వానికి, సమ్మిళిత సేవల పంపిణీకి ఈ పంచాయతీ ఒక గొప్ప ఉదాహరణగా నిలిచింది.

జాతీయ డిజిటల్ పరిపాలన అవార్డులు 2025లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన గ్రామ పంచాయతీల జాబితాలో నిలిచిన తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లాలోని శివారెడ్డిగూడెం గ్రామ పంచాయతీని కూడా ఈ సదస్సులో ఘనంగా సన్మానించారు. పారదర్శకతకు, ప్రజల అవసరాలకు తగ్గట్టుగా పనిచేయడానికి, సాంకేతికతను ఉపయోగించుకుని గ్రామ స్థాయిలో అద్భుతమైన పాలన అందించడానికి ఈ పంచాయతీ ఒక ఆదర్శవంతమైన నమూనాగా కొనియాడారు.

గ్రామ స్థాయిలో డిజిటల్ సేవలను ప్రజలకు చేర్చడంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన గ్రామస్థాయి డిజిటల్ సేవల నిర్వాహకులైన శ్రీమతి గిరిజా నాథ్ (అస్సాం) శ్రీమతి సుమిత్రా దాస్ (ఒడిశా), శ్రీ అమన్‌దీప్ సింగ్ (పంజాబ్), శ్రీమతి సుర్తా దేవి సైనీ (రాజస్థాన్)లను సత్కరించారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి గ్రామ పంచాయతీలు, పౌర సేవా కేంద్రాలు కలిసి పనిచేయడం అత్యంత ముఖ్యమని కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీమతి ముక్తా శేఖర్ పేర్కొన్నారు. ఇది స్థానిక అవసరాలపై ఉన్న అవగాహనను, డిజిటల్ సాంకేతికతతో ముడిపెడుతుందని చెప్పారు. ప్రతి గ్రామీణ పౌరుడికి గౌరవాన్ని, సులభంగా సేవలు పొందే సౌకర్యాన్ని, సమానత్వాన్ని అందించడమే డిజిటల్ పాలన ముఖ్య ఉద్దేశమని తెలిపారు.గ్రామ పంచాయతీల సేవల్లో సరికొత్త ఆవిష్కరణలను గుర్తించి, ప్రోత్సహించడం కోసం జాతీయ డిజిటల్ పరిపాలన అవార్డులు 2025 కింద గ్రామ పంచాయతీ సేవా పంపిణీ కోసం ప్రత్యేక విభాగాన్ని ప్రవేశపెట్టినట్లు ఈ సందర్భంగా ఆమె భాగస్వాములకు తెలియజేశారు.

అస్సాం ప్రభుత్వ పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ బల్లెపు కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ.. అందరికీ సమానమైన, డిజిటల్ పాలన అందించడానికి తమ రాష్ట్రం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. గ్రామ స్థాయిలో సేవలను మరింత సమర్థవంతంగా, ప్రజల అవసరాలకు తగ్గట్టుగా అందించడంలో పంచాయతీ రాజ్ సంస్థల పాత్ర, అధికారాల వికేంద్రీకరణ ముఖ్యమని తెలిపారు వివిధ రాష్ట్రాలు తమ అనుభవాలను పరస్పరం పంచుకోవడం, గ్రామీణ పాలనను మెరుగుపరచడంలో డిజిటల్ వేదికల పాత్ర కీలకమని పేర్కొన్నారు. సేవా సే సమృద్ధి విస్తృత లక్ష్యానికి అస్సాం కట్టుబడి ఉంటుందని పేర్కొంటూ.. ఈ సదస్సులో జరిగే చర్చలు దేశవ్యాప్తంగా పంచాయతీ రాజ్ వ్యవస్థలను బలోపేతం చేయడానికి ఉపయోగపడే ఆచరణాత్మక ఫలితాలకు దారితీస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

పౌర సేవా కేంద్రాలు నేడు ప్రపంచంలోనే అతిపెద్ద సేవా వ్యవస్థల్లో ఒకటిగా ఎదిగాయని సీఎస్సీ-ఎస్‌పీవీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ శ్రీ అఖిల్ కుమార్ తెలిపారు. దీనివల్ల ఎక్కడో సుదూర ప్రాంతాల్లో ఉండే గ్రామీణ ప్రజలు కూడా ఆధార్, పాన్ కార్డు, బ్యాంకింగ్, బీమా, పెన్షన్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాల వంటి సేవలను సుదూర ప్రాంతాలకు ప్రయాణించాల్సిన అవసరం లేకుండా తమ సొంత ఊరిలోనే సులభంగా పొందగలుగుతున్నారని చెప్పారు. ఈ సీఎస్సీ విధానం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో గొప్ప సామాజిక, ఆర్థిక మార్పు వచ్చిందని పేర్కొన్నారు. లక్షలాది మంది గ్రామ స్థాయి డిజిటల్ సేవల నిర్వాహకులు ముఖ్యంగా ఎంతో మంది మహిళా పారిశ్రామికవేత్తలు దీని ద్వారా స్వయం సమృద్ధి సాధించారని, గ్రామ స్థాయిలో డిజిటల్ మౌలిక సదుపాయాలు కూడా బలోపేతం అయ్యాయని వివరించారు.

వివిధ రాష్ట్రాల ప్రతినిధులు ఒకరి అనుభవాలను ఒకరు తెలుసుకోవడానికి, పంచాయతీల ఆధ్వర్యంలో సేవలను అందించడంలో తాము పాటిస్తున్న ఉత్తమ పద్ధతులను పంచుకోవడానికి ఈ సదస్సు ఒక గొప్ప వేదికగా నిలిచింది. ఇందులో 'విధానాల నుంచి ప్రజల వరకు: పరిపాలనను ఆచరణలోకి తీసుకురావడం' పేరుతో జరిగిన మొదటి ప్యానెల్ చర్చకు అస్సాం ప్రభుత్వ పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ శ్రీమతి కీర్తి జల్లి సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ చర్చలో సీఎస్సీ-ఎస్‌పీవీ, ఈ-మిత్ర (రాజస్థాన్), ఈ-సేవ (పంజాబ్), లోక్ సేవా గ్యారెంటీ పోర్టల్ (మధ్యప్రదేశ్), పంచాయతీ సచివాలయం (ఆంధ్రప్రదేశ్), మీ సేవ (తెలంగాణ), ఒడిశా వన్ (ఒడిశా) వంటి వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖ సేవా పంపిణీ వేదికల ప్రతినిధులు పాల్గొన్నారు.

'సాంకేతికతతో కూడిన పంచాయతీ రాజ్, సేవల పంపిణీ' అంశంపై జరిగిన మొదటి సాంకేతిక సమావేశాన్ని ఐఐటీ గువాహటి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సిద్ధార్థ సింఘా నిర్వహించారు. రెండో సాంకేతిక సమావేశాన్ని భాషిణి సీఈఓ శ్రీ అమితాబ్ నాగ్ నిర్వహించారు. మౌలిక సదుపాయంగా భాష: భాషిణి ద్వారా చివరి వ్యక్తి వరకు పాలనను సరికొత్తగా అందించడం అంశంపై ఆయన మాట్లాడారు. వివిధ భాషలతో కూడిన డిజిటల్ సాంకేతికత ద్వారా దేశంలోని చివరి వ్యక్తికి కూడా ప్రభుత్వ పాలనను వారి సొంత భాషలోనే ఎంతో సులభంగా, సమానంగా ఎలా చేర్చవచ్చో ఆయన వివరించారు.

# స్వాతంత్ర్యోద్యమంలో జైలుకు వెళ్ళిన తొలి తెలుగు మహిళ దువ్వూరి సుబ్బమ్మ

శ్వేత జాతీయుల పాలనలో వారి అరాచకాలకు వ్యతిరేకంగా మహాత్మాగాంధీ ఇచ్చిన సందేశా లకు ప్రభావితమై ఎందరో వ్యక్తిగత ఇబ్బందులను అధిగమించి, బ్రిటీష్ పాలకులకు దేశం నుంచి వెళ్ల గొట్టాలనే ధృఢ సంకల్పంతో ముందుకు సాగారు. అలాంటి వారిలో, దువ్వూరి సుబ్బమ్మ గాంధీజీ ప్రశంసలు పొందిన వనిత. బ్రిటీష్ వారి బానిన సంకెళ్లను తెంచి భరతమాత దాస్య విముక్తి కోసం జరిగిన స్వతంత్ర పోరాటంలో ఎందరో మహిళలు స్ఫూర్తి దాయకంగా స్వాతంత్ర్యోద్య మంలో పాల్గొన్నారు. ఆ చారిత్రక ఉద్యమంలో పురుషులతో పాటు స్త్రీలు కూడా త్యాగాలకు సిద్ధ పడ్డారు. మహిళలు గడప దాటని కట్టుబాట్ల కాలంలో, భరతమాత దాస్య సంకెళ్లను తెంచేందుకు స్వతంత్ర పోరాటం చేస్తూ ఉద్యమానికి ఎందరో మహిళలు ఊపిరిగా నిలిచారు. అలనాటి మహిళలలో ప్రథమ వరసలో నిలిచే మహిళల్లో తొలి మహిళగాజైలుకు వెళ్ళిన ధీశాలి దువ్వూరి సుబ్బమ్మ.

దేశ బాంధవి, సమాజ సేవకురాలు దువ్వూరి సుబ్బమ్మ 1880 - 31 మే, 1964) స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళిన తొట్ట తొలి తెలుగు మహిళ. స్త్రీ జనోద్ధరణకు కృషి చేస్తూనే సహాయ నిరాకర ణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో ఆమె చురుకుగా పాల్గొన్నారు. రాజ మండ్రిలో స్త్రీలకు విద్య నేర్పించడం కోసం పాఠశాల, వసతిని ఏర్పాటు చేసారు. కాకినాడలో(1923) జరిగిన కాంగ్రెస్ సభలో సుబ్బమ్మ చేసిన సేవలకుగాను 'దేశ బాంధవి' అనే బిరుదు పొందారు.

సుబ్బమ్మ తూర్పుగోదావరి జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామం గ్రామంలో 1880 సంవత్సరం నవంబరు నెలలో

**మే 31...దువ్వూరి సుబ్బమ్మ వర్ధంతి**



మధ్యతరగతి వైదిక బ్రాహ్మణ కుటుంబంలో మల్లాది సుబ్బావ ధాని దంపతులకు జన్మించారు. దువ్వూరి వెంకయ్యతో బాల్య వివాహం జరగడం, భర్తను చిన్నతనంలోనే కోల్పోయి బాల్య వితంతువు కాగా, ఆ రోజుల ఆచారమును బట్టి ఆమెకు కేశములు తీసివేసినా, తలకు ముసుగు వేసినా, సంప్రదాయ కట్టుబాట్లను కాదని, వేషంకు సిగ్గు పడక, ఆధ్యాత్మిక చింతగల వారైనా, స్వాతంత్ర్య పోరాటం లోనికి పరుగులు తీసిన ధీశాలి. ఆమె ఎన్నో లాఠీ దెబ్బల కోర్చింది. జైలుకు పలుమార్లు వెళ్ళింది.

సుబ్బమ్మ స్వాతంత్ర్యోద్యంలో కాకినాడలో జరిగిన రాజకీయ సమావేశంలో పాల్గొని సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని లక్ష్యంగా బలపరు స్తూ అనర్గళంగా ప్రసంగాలు చేశారు. 1922 లో సహాయ నిరాకరణోద్యమంలో ప్రముఖ పాత్ర వహించారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాలలో పాల్గొన్నారు. ఒక సన్నివేశంలో ఈమెను ఆంగ్లేయులు నిర్భంధించి, క్షమాపణ చెబితే విడిచి పెడతామ నప్పుడు "నా కాలి గోరు కూడా అలా చేయదు'' అని నిస్సంకోచంగా చెప్పిన ధైర్యవంతురాలు.

సుబ్బమ్మ మహాత్మా గాంధీ ఆదేశాలపై ఖద్దరు ధరించారు. విరాళాలు సేకరించి స్త్రీలకు విద్య, నేర్పి, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. రాజమండ్రిలో సనాతన స్త్రీవిద్యాలయం అనే బాలికల పాఠశాలను స్థాపించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు ఈమె అందరికి మిఠాయిలు పంచారు. ఈమె 16 సంవత్సరాల పాటు ఏ.ఐ.సి.సి. సభ్యురాలిగా ఉన్నారు. కాకినాడలో 1923లో జరిగిన కాంగ్రేసు సభలో ఈమెకు 'దేశ బాంధవి' అనే గౌరవం ఇచ్చారు. జవహర్ లాల్ నెహ్రూ మరణానంతరం, 1964 మే 31న ఆమె పరమపదించారు.



-రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

# మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే.. నిత్యం ప్రజల మధ్య ఉండండి : మాజీ మంత్రి తలసాని




హైదరాబాద్, మే 30: కేసీఆర్ మళ్లీ రావాలి.. రాష్ట్రం మొత్తం ఇదే నినాదం మార్మోగుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ నేతలతో కలిసి ముషీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. హామీల అమలు గురించి ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి పండపెట్టి తొక్కుతాం.. గోటీలు అడుతా అంటుండు. మిమ్మల్నిప్రజలు పండపెట్టి తొక్కే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. పార్టీలో కష్టపడి పని చేసే వారికి సముచిత స్థానం లభిస్తుందన్నారు.కేసీఆర్ అద్భుతమైన పాలన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల గౌరవాన్ని పెంచిందన్నారు.

గులాబీ జెండా శ్రీరామరక్ష.. మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే.. ధైర్యంగా ఉండండి.. పార్టీ మీకు అండగా ఉంటుంది. నిత్యం ప్రజల మధ్య ఉండండి.. ప్రజా సమస్యలపై ముందుండి పోరాడండి అని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత

**-విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖల అధికారులతో సమీక్షా సమావేశంలో మంత్రి దామోదర రాజనర్సింహ.**



సంగారెడ్డి, మే 30 (నేటి నిజం ప్రతినిధి) రాష్ట్రంలో విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.

శనివారం సంగారెడ్డి కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులకు అనుకూలమైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మైనర్, మేజర్ మరమ్మత్తులు చేపట్టడంతో పాటు అదనపు తరగతి గదుల నిర్మాణం, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, ప్రహరీ గోడల నిర్మాణం, పాఠశాల భవనాలకు ఆకర్షణీయమైన రంగులు వేయడం వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.

పాఠశాలలను విద్యార్థులు చూసిన వెంటనే చదువుపై ఆసక్తి పెరిగేలా, పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని మంత్రి పేర్కొన్నారు.

అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలురు, బాలికల వసతి గృహాల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలను మెరుగు పరిచి విద్యార్థులకు సౌకర్యవంతమైన, సురక్షితమైన వాతావరణం కల్పించాలని తెలిపారు.

ముఖ్యంగా బాలికల వసతి గృహాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ భద్రత, పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య సదుపాయాలు మరియు ఇతర అవసరమైన వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

బుధేరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉర్దూ మీడియం ప్రారంభానికి సంబంధించి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిని మంత్రి ఆదేశించారు.

విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో విద్యాసంస్థలు, వసతి గృహాలు కీలక పాత్ర పోషిస్తున్నందున సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు.

అదనపు కలెక్టర్లు సంగీత, పాండు , సంబంధిత శాఖల అధికారులు, ఆర్సీవోలు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి,టి జి ఈ డబ్ల్యూ ఐ డి సి ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

**– బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**

కరీంనగర్, మే 30:కరీంనగర్‌లో బీజేపీ శ్రేణుల శిక్షణ తరగతుల ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు, రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిం చారు .ధాన్యం కొనుగోలు, రవాణా, గోదాముల నిర్వహణ తదితర ఖర్చులకు అవసరమైన నిధులన్నీ కేంద్ర ప్రభుత్వమే అందిస్తున్నప్పటికీ, రైతుల నుంచి వడ్లను సక్రమంగా కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శించారు. రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు "రైతు గోస ? బీజేపీ భరోసా'' యాత్ర నిర్వహించినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని అన్నారు.అకాల వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, అయినప్పటికీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వ ఉండటం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ధాన్యం సేకరణపై ప్రభుత్వానికి స్పష్టమైన గణాంకాలు లేవని, మంత్రులే పరస్పర విరుద్ధమైన లెక్కలు చెబుతున్నారని విమర్శించారు.వడ్ల కొనుగోళ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కేవలం మధ్యవర్తి పాత్ర మాత్రమే పోషిస్తోందని, ఇందుకు కేంద్రం కమిషన్ కూడా చెల్లిస్తోందని రామచందర్ రావు అన్నారు. అయినప్పటికీ రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు.కొనుగోలు కేంద్రాల్లో మిగిలి ఉన్న ధాన్యాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తిగా కొనుగోలు చేయాలని, అకాల వర్షాలతో దెబ్బతిన్న ధాన్యాన్ని కూడా రైతులకు నష్టం కలగకుండా స్వీకరించాలని డిమాండ్ చేశారు. అలాగే అన్ని రకాల వడ్లకు బోనస్ ప్రకటించాలని కోరారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ పై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. ధాన్యం కొనుగోళ్ల సమస్యలను పరిష్కరించకుండా భవిష్యత్తులో ఎరువుల కొరత గురించి ముందుగానే వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. యూరియా సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, రైతులకు ఎరువుల సరఫరాలో లోపాలు జరిగితే వాటిని కేంద్రంపై నెట్టే ప్రయత్నాలు చేయవద్దని హెచ్చరించారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**-మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి గుర్రం అశోక్**





రాజన్న సిరిసిల్ల, మే 30: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణ మున్సిపల్ కార్యాలయం ముందు తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సీఐటీయూ 57వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి గుర్రం అశోక్ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1970లో ఆవిర్భవించిన సీఐటీయూ దేశవ్యాప్తంగా వివిధ రంగాల కార్మికుల హక్కుల కోసం పోరాడి, కార్మిక-కర్షక వర్గాల న్యాయమైన డిమాండ్ల సాధనలో కీలక పాత్ర పోషించిందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటినా మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలమైందని విమర్శించారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈరోజు నుంచి జెండా ఎత్తి నిరసన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. నెలరోజుల పాటు వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగిస్తామని, ఈలోపు ప్రభుత్వం స్పందించి కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించి, స్కిల్ వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా సీఐటీయూ మున్సిపల్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె చేపట్టేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు సరిపెల్లి నరేష్, ప్రధాన కార్యదర్శి దూబ్బల చయ్య, రాష్ట్ర నాయకుడు కీసర్ శ్రీనివాస్, జిల్లా నాయకులు కావాల సత్తయ్య, బొట్టు శ్రీను, పిట్టల శంకర్, బొడ్డు శ్రీనివాస్, సుంకపాక పరశురాములు, సూపర్ శంకర్, వావిలాల మమత, మనీషా, తోట శంకరవ్వ, ఎల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ మున్సిపల్ కౌన్సిల్ కీలక నిర్ణయాలు

**– 52 అజెండా అంశాలకు ఆమోదం..-:**

**-ప్లాస్టిక్ ప్లేట్ల నిషేధం, పారిశుధ్య కార్మికులకు బీమా**




రాజన్న సిరిసిల్ల, మే 30: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అధ్యక్షతన నిర్వహించిన సాధారణ కౌన్సిల్ సమావేశంలో 52 అజెండా అంశాలకు ఆమోదం లభించింది. పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ, కార్మికుల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక నిర్ణయాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది.పట్టణంలోని ఫంక్షన్ హాళ్లలో ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసుల వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని కౌన్సిల్ నిర్ణయించింది. అలాగే మున్సిపాలిటీలో పనిచేస్తున్న 203 మంది పారిశుధ్య కార్మికులకు రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించనున్నట్లు చైర్మన్ వెల్లడించారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రధాన రహదారుల వెంట ఉన్న కోనో కార్పస్ చెట్లను తొలగించి వాటి స్థానంలో పూలు, నీడనిచ్చే మొక్కలను నాటాలని తీర్మానించారు. గత పాలకవర్గం ఆమోదించిన జేసీబీ కొనుగోలు ప్రతిపాదనను రద్దు చేసి, చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు నాలుగు కొత్త ట్రాలీ ఆటోలను కొనుగోలు చేయాలని నిర్ణయించారు.వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. మురుగు కాలువల పూడికతీత, రోడ్ల మరమ్మతులు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. డ్రైనేజీలలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, వీధి దీపాల నిర్వహణను పర్యవేక్షించాలని ఆదేశించారు.మున్సిపల్ పరిధిలోని విలీన గ్రామాల్లో గుంతలమయమైన రహదారులను మట్టితో పూడ్చే పనులు ఇప్పటికే ప్రారంభించినట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పట్టణవ్యాప్తంగా 500 సూచిక బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో వేములవాడను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చైర్మన్ పుల్కం రాజు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే వార్డుల సమస్యలకు వేగంగా పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. వార్డుల సమస్యలను కౌన్సిలర్లు సభ దృష్టికి తీసుకురాగా, వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని పాలకవర్గం హామీ ఇచ్చింది.

# ముస్తాబద్‌లో 101 సీసీ కెమెరాల ప్రారంభం




రాజన్న సిరిసిల్ల, మే 30: (నేటినిజం ప్రతినిధి): నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని మరింత బలోపే తం చేస్తూ ముస్తాబద్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన 101 సీసీ కెమెరాలను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే శనివారం ప్రారంభిం చారు.ముస్తాబద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ, నేరాల నియంత్రణ, నిందితుల గుర్తింపు, కేసుల ఛేదనలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానంగా పనిచేస్తుందని పేర్కొన్నా రు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞా నం, డిజిటల్ నిఘా వ్యవస్థలు, ఆధునిక దర్యాప్తు పద్ధతుల వినియోగంతో నేరాలను సమర్థ వంతంగా అరికట్టడంతో పాటు నిందితులను త్వరితగతిన గుర్తిం చి చట్టపరమైన చర్యలు తీసుకు ంటున్నామని చెప్పారు. గ్రామా లు, పట్టణాల్లో ప్రజలు, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛ ందంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజల భాగసా ్వమ్యం తోనే సమాజంలో శాంతిభద్రత లు మరింత బలోపేతం అవుతాయని ఎస్పీ అన్నారు. ముస్తాబద్ మండలంతో పాటు పలు గ్రామాల్లో 101 సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరిం చిన దాత లను ఆయన ప్రత్యేకంగా అభినం దించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ నాగేశ్వ రరావు, ఎస్ఐ గణేష్, ప్రజాప్రతి నిధులు, సీసీ కెమెరాల సంస్థ ప్రతినిధులు, పాల్గొన్నారు.

# వలస కార్మికుల వివరాల నమోదు తప్పనిసరి

**-పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం**




కరీంనగర్, మే 30: కమిష నరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణకు పోలీసులు అప్రమత్తంగా పనిచేయాలని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం సూచించారు. శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పోలీస్ స్టేషన్ల పనితీరు, డిజిటల్ రికార్డుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు.

కరీంనగర్ పరిధిలో పనిచేస్తున్న నేపాలీలు, ఇతర రాష్ట్రాల వలస కార్మికుల పూర్తి వివరాలను గుర్తింపు కార్డులతో సహా పోలీస్ స్టేషన్లలో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం దాదాపు వెయ్యి మంది నేపాలీల్లో 169 మంది వివరాలే నమోదైనట్లు తెలిపారు .సీసీటీఎన్ఎస్ పోర్టల్‌లో కేసుల వివరాలను నిర్ణీత గడువులోగా అప్‌లోడ్ చేయాలని, నిర్లక్ష్యాన్ని సహించ బోమని హెచ్చరించారు. రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని, శాంతిభద్రతలకు భంగం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.పోలీస్ స్టేషన్లలోని మాల్ఖానాల నిర్వహణ పారదర్శకంగా, క్రమబద్ధంగా ఉండాలని, స్వాధీన వస్తువుల రికార్డులు స్పష్టంగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఏసీపీ సీసీఆర్‌బీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ సరిలాల్, కమ్యూనికేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.